

## ఉపోద్ఘాతము

### ఇది పంచమ స్కంధము.

పంచమ స్కంధము భగవానునికి నాభి వంటిది.

ఈ స్కంధము ఆశ్రమ ధర్మముల నన్నిటినీ ఉద్దీపింప జేయుచు ఆకర్షణీయమైన, ఆదర్శవంతమైన సందేశములతో నిండి యున్నది. ప్రియవ్రతుని చరిత్రము గృహస్థుల నావకు మార్గగామి యై యున్నది. శత్రువును కోటలో నిలచి ఎదుర్కొనుట ఉత్తమమైనట్లు గృహస్థాశ్రమ కోటలో నిలబడి కామ క్రోధాది శత్రువులను ఎదుర్కొని జయించుట ఉత్తమమని బ్రహ్మదేవుడు ప్రియవ్రతునకు తెలుపును.

వివాహము ద్వారా జన్మాంతర వాసనలు నశించును. కొంత కాలము సంసార సుఖముల ననుభవించి, ఆ తరువాత సన్యసించుట ఉత్తమమని తెలుపును. ప్రియవ్రతుని చరిత్రము గృహస్థాశ్రమ వైభవమును కీర్తించుచుండగ, జడభరతుని చరిత్రము అవధూత వైభవమును ఘనముగ స్తుతించినది. ఒకటి మార్గము కాగా రెండవది గమ్యమగు చున్నదని ఈ స్కంధము వివరించును.

వాసన ప్రమాదమైనది. ఏ ఒక్క వాసన దృఢముగ మనస్సునంటినను అది జన్మకు కారణమగును. లేడిని ప్రేమించి, చివరి క్షణాన లేడినే స్మరిస్తూ మరణించినందున భరతుడు లేడి జన్మనెత్తెను. కనుక వాసనలను తయారుచేసే సంకల్పముల విషయములో సాధకులు జాగరూకులై యుండవలెనని పంచమ స్కంధము బోధించును. ఈ విధముగా అంతర్యములో విక్షిప్తమైయున్న వాసనలను పూర్వచిత్తి అప్సర రూపమున చూపును. ముఖ్యంగా ఈ స్కంధమున వర్ణింపబడిన భవారణ్యము విషయవాసనాపరులకు కనువిప్పును కలిగించును. ఈ స్కంధము సర్వులకు ఉపకరించును.

# చైతన్య భాగవతము

## పంచమ స్కంధము

### ప్రియవ్రతుని చరిత్ర

మనుజులు దుఃఖమును గర్హింతురు. కానీ దుఃఖ కారణములను ప్రేమింతురు. దుఃఖ బీజములను నాటి శోకఫలములు రాగూడదని తలంచుచుందురు. ఇదొక అయోమయ ధోరణి. మండుటెండలో నిలబడి చల్లదనమును అభిలషించుట అవివేకమే అవుతుంది.

సుఖాన్ని అందరూ వాంఛిస్తారు. కానీ సుఖ కారణములను దూరం చేసుకుంటారు. సుఖ బీజములను నాటకుండ ఆనంద ఫలముల నారగింపవలెనని శ్రమించు చుందురు. భ్రమించు చుందురు. ఇదొక అస్తవ్యస్త ధోరణి.

బంధాలు బయట లేవు. అందాలు బయటనుండి రావు. మనస్సులో అసత్యమైన ప్రపంచము శోభించునంత కాలము జీవులకు క్షోభ తప్పదు. పట్టుపరుపులపై పరుండినను రోగికి నిద్రపట్టదు. సుందరమైన ప్రకృతి వాస్తవానికి అంధునకు లేనిదియే. అంతర్యంలో బంధాలు పెంచుకొని బాహ్యంలో అందాల నన్వేషించేవానికి భవబంధాలు వీడవు. సంసార సంకెళ్ళు ఊడవు.

సంసారమును త్యజిస్తే పోతుంది గదా అని నీవు ఆలోచించవచ్చు. నిజమే. అలా చేసినచో సంసారము పోవచ్చు. కానీ సంసార బీజాలు లోపల సజీవంగానే ఉంటాయి. నీవు ఎక్కడికెళ్ళినా అవి నీతోనే ఉంటాయి. పెరిగి శాఖోపశాఖలతో వృక్షాలవుతాయి. ఆ నీడలోనే నీవు విశ్రమింపవలసి యుంటుంది.

సంసారమును వదలినంత మాత్రాన శాంతి లభించదు. అలాగని పెనవేసుకున్నంత మాత్రాన సుఖించేది యుండదు. సుఖదుఃఖాలు మనో కల్పితాలు. వాసనలు కర్మ ప్రేరకములు. వాసనలను క్షాళనం చేసుకుంటే నీవు ఎక్కడున్నావనేది సమస్యగాదు. వాసనలు మిగిలివుంటే నీవు ఎక్కడున్నప్పటికీ నీవే ఒక సమస్యగా మిగులుతావు. మనస్సును సంస్కరించుకోవాలి. సంస్కరింపబడిన మనస్సును స్థిరపరచుకోవాలి. తృప్తిగా జీవించాలి. ఈ సత్యాన్ని పంచమ స్కంధము విరివిగా చాటుతుంది.

మనుజుని విషయ వాసనా సుడిగుండములో నుండి ఉద్ధరించువాడు పరమాత్మ యొక్కడే. ఆ దివ్యాత్మునిపై పూర్ణ విశ్వాసమును కలిగియుండాలి. భగవంతుని అనుగ్రహముపై నమ్మకముండాలి. ఇంద్రియములను నమ్మకూడదు. ఆరిపోయే దీపాల వంటి విషయ సుఖాలలో రమించేందుకు ఉత్సాహపడకూడదు.

అనన్యభక్తితో భగవదాశ్రయమును బొందిన వారిని బాధించు శక్తి ప్రపంచమునకు లేదు. భక్తి విశిష్టమైనది. అది భయకారణములకు భయమును పుట్టించును. దుఃఖ కారణములకు దుఃఖమును కలిగించును. యోగక్షేమముల విచారమును దూరము చేయును. సర్వాశ్రయములు దూరమైనను సర్వేశ్వరుడు లభించినచో సమస్తము నీకు వశమే. విశ్వమే నీ వశమగును.

సాగరములో కల్లోల కెరటాలు లేచునట్లు, బ్రతుకులో ఆవేదనా అలలు లేస్తుంటాయి. అలల మధ్యనే సముద్రస్నానాన్ని ముగించుకొను లాగున, ఆవేదనల మధ్యనే బ్రతుకుకు పరమార్థం కల్పించుకోవాలి. ఈ విధమైన జీవన నడకను ఐదవ స్కంధము నేర్పుతుంది. ఈ పంచమ స్కంధము మధురమైన జీవన ఫలములను విరివిగా పంచుతుంది. బ్రతుకుకు ప్రశాంతతను ప్రసాదిస్తుంది.

"మహాత్మా! ప్రియవ్రతుడు పరమ భాగవతోత్తముడు. సదా ఆత్మయందే రమించువాడు. అట్టి మహితాత్ముడు గృహస్థుడై ఎలా చరింపగలిగెను? రమింప గలిగెను? ముక్తిని గోరువారు కర్మబంధములను తగిలించు గృహఛిద్రముల యందు చరింపరు గదా! పుండరీకాక్షుని చరణముల నీడలో విశ్రమింపగోరు పుణ్యాత్ములు సంసారిక విషయముల యందు విస్పృహ నొందుచుందురు. సంసార స్పృహయున్న వారికి సారరూపుడగు భగవానుడెట్లు లభించును?" యని అభిమన్యుని కుమారుడైన పరీక్షిన్మహారాజు ప్రజ్ఞానఘన సుజ్ఞానుండగు శుకబ్రహ్మను ప్రశ్నించెనని నైమిశారణ్యమున సూతమహర్షి శౌనకాది మునులకు చెప్పుచున్నాడు:

"రాజా! హరిపాదపద్మముల మకరంద రసమున లగ్నమైన చిత్తముగల సత్పురుషులు సంసార విఘ్నముల కారణముగ హరిచింతనమును మానరు. ప్రియవ్రతుడు పుణ్యచరితుడు. నారదమహర్షి వలన తత్త్వ జ్ఞానమును బొంది నివృత్తి మార్గాభిలాషి అయ్యెను. ప్రియవ్రతుని సంసారమున ప్రవేశింపుమని ఆయన తండ్రియగు మనువు కోరెను. ప్రియవ్రతుడు అంగీకరించలేదు. సంసారము భక్తిని వంచించునని భావించెను. అతనికి బోధించుటకై పుణ్యఫల విశేషముగ సృష్టికర్తయగు చతుర్ముఖ బ్రహ్మయే దిగి వచ్చెను" యని శుకబ్రహ్మ బోధింపసాగెను.



నిర్జన ప్రదేశము, ప్రశాంత స్థలమునగు ఒక గుహలో నారదుడు ప్రియవ్రతునికి జ్ఞానబోధ చేయుచుండెను. తన పుత్రుని గొనిపోవుటకు మనువుగూడ అక్కడికి వచ్చి యుండెను. అదే సమయమున హంసారూఢుడై బ్రహ్మదేవుడు అచ్చటి కరుదెంచెను. ప్రియవ్రత మనువులతో గూడి నారదుడు బ్రహ్మదేవుని స్తుతించెను.

బ్రహ్మదేవుడు ప్రియవ్రతునితో ఇట్లనెను: "వత్సా! ప్రియవ్రతా! జీవుడు ఈశ్వరుని అధీనమున యుండువాడే గాని స్వతంత్రుడు గాడు. ముక్కుత్రాళ్ళ ద్వారా మనుజులు పశువులను వశము చేసికొనునట్లు గుణత్రయంబనెడి రజ్జువుచే పరమాత్మ జీవులను వశపరచుకొని యున్నాడు;" యని చెప్పసాగెను.

జీవుడు కర్మల నాచరించును. భగవానుడు ఫలముల ననుగ్రహించును. భగవానుడు ప్రసాదించు ఫలములను ప్రసాదముగ స్వీకరించి అంధుడు కళ్ళున్న వానిని అనుసరించు లాగున జీవులు పరమాత్మను అనుసరించుచుందురు. పరమాత్మ కర్మానుసారంగా ప్రసాదించు సుఖ దుఃఖములను అనుభవించు చుందురు.

ఆత్మవేత్తయగు పురుషుడు కర్మల యొక్క ఫలితముల ననుభవించు చుండినను వాటికి అంటకుండ యుండును. నిద్రనుండి మేల్కొనినవాడు స్వప్నములోని విషయములనెలా భావించునో ఆత్మజ్ఞాని సుఖదుఃఖములను అలా స్వీకరించును. జన్మకు కారణమయ్యే విషయముల యందు అతడు తగుల్కొనడు.

## సర్వాన్కామా న్పరిత్యజ్య అద్వైతే పరమే స్థితిః

"ఆత్మవిదుడు సమస్తమైన కోరికలను వదలినవాడై ఉత్కృష్టమైన అద్వయ పరమాత్మయందు మనస్సును నిలిపి యుండును" యని పరమహంసోపనిషత్తు ప్రవచించినది.

ఆత్మజ్ఞానియైన వానికి దేహాంతరప్రాప్తి యుండదు గనుక అతడు సర్వమును త్యజించును. కానీ ఆత్మజ్ఞానము లేనివాడు, ఇంద్రియములను జయింపనివాడు కర్మలను త్యజింపకూడదు. ఒకవేళ త్యజించి అరణ్యములకు వెళ్ళినను సంసారము తయారయ్యే ప్రమాదము గలదు.

సంసార వాసనలు క్షాళనం గానిచో వనాల కెళ్ళి సాధించే దేమియును లేదు. సంసార వాసనలు క్షాళనమైనచో వనాలకు వెళ్ళవలసిన అవసరమేలేదు.

వాసనలు తీవ్రముగా యుండునపుడు సంసారమును వదలకుండా జీవనయాత్ర సాగిస్తుండాలి. సంసారములోనే యుండినచో వాసనలు వృద్ధియగునే గాని శూన్యముగావు. మరి జీవి ఎలా తరించాలి? వాసనలున్నవి గనుక సంసారములోనే యుండాలి. వాసనలను క్షాళన మొనర్చుకొనేందుకు మనస్సులో సన్యాసమును పొందాలి. ఇదియే కర్మయోగ రహస్యము. గృహస్థాశ్రమ ప్రాశస్త్యము.

భయంకరమైన శత్రువులను కలిగియున్నవాడు స్వేచ్ఛావిహారి గాకూడదు. మనుజునికి ఆరుగురు శత్రువులున్నారు. వారే మనస్సుతో గూడిన జ్ఞానేంద్రియములు. ప్రతి చాలా భయంకరమైన శత్రువులు. ఏ క్షణాన్నైనా కీడు కల్పించవచ్చును. ఇవి

శత్రువులను జయించినవాడు నగరమునందుగాని, వనమునందు గాని స్వేచ్ఛగా విహరింప వచ్చును. కోటలో దాగి సైనికుడు శత్రువులను జయించును. అలాగే ప్రతి మనుజుడు గృహస్థాశ్రమ మనెడి కోటలో నిలిచి ఇంద్రియ మనోబుద్ధులనెడి శత్రువులను జయింపవలెను. మనోబుద్ధులతో గూడి జ్ఞానేంద్రియములు నిగ్రహింపబడినచో అదియే పరమాత్మస్థితి యనబడును.

**యదా పఞ్చావ తిష్ఠన్తే జ్ఞానాని మనసా సహ**
**బుద్ధిశ్చ న విచేష్టతి తమాహ్యుః పరమాంగతిమ్**

"ఏ స్థితిలో మనస్సుతో గూడి జ్ఞానేంద్రియములు స్థిరముగ నుండునో, బుద్ధి చలింపక యుండునో అట్టి స్థితి పరమోత్కృష్టమైనది" యని కఠోపనిషత్తు తెలిపినది.

సంసారములో యుండి వివేకము ద్వారా వాసనలను తగ్గించుకోవాలి. ఇంద్రియము లను జయించినవాడు గృహములో హాయిగా జీవించగలుగును. ఇంద్రియలోలుడు అరణ్యములలో గూడా దు:ఖమునే అనుభవించును. కనుక గృహస్థాశ్రమముననే యుండి తరింపుమని బ్రహ్మదేవుడు ప్రియవ్రతునికి చెప్పెను. ప్రియవ్రతు డంగీకరించెను. సర్వులు నమస్కరించుచుండగ బ్రహ్మ అంతర్హితుడయ్యెను. తండ్రియైన మనువు యొక్క అభ్యర్థనపై ప్రవృత్తి మార్గము వైపునకు తిరగని ప్రియవ్రతుని బ్రహ్మదేవుడు ప్రవృత్తి మార్గము వైపునకు త్రిప్పెను. గృహస్థాశ్రమ ధర్మములను నిర్వహించిన తరువాత ప్రియవ్రతునికి నివృత్తి మార్గము ద్వారా నిర్వికల్పానందము లభించుగాక! యని బ్రహ్మదేవుడు మనస్సులో సంకల్పించెను. మహాత్ముల సంకల్పాలు ఎన్నడూ వృథాగావు.

మనువు ప్రియవ్రతునికి రాజ్యము నప్పగించి తాను సన్యసించెను. విషమంబులనెడి విషయంబుల నుండి విడిపడి కానలకేగెను. భగవదాజ్ఞను శిరసావహించి ప్రియవ్రతుడు రాజ్యభారమును వహించెను. విశ్వకర్మ పుత్రిక యైన బర్హిష్మతి యను నామెను వివాహ మాడెను. భూమండలమును చక్కగ పాలించుచుండెను.

**మ॥ ధరణీవల్లభుఁ డా ప్రియవ్రతుడు మోదం బందుచున్ లీల నీ**
**శ్వరవాక్యంబున గర్మతంత్రపరుడై సంగంబులం బాపు శ్రీ**
**హరిపాదాంబుజచింతనం దగిలి నిత్యానందముం బొంది దు**
**ర్భర రాగాదుల బాఱదోలి ప్రజలం బాలించె నత్యున్నతిన్.**

ప్రియవ్రతునకు పదుగురు పుత్రులు, ఊర్జస్వతి యను పుత్రిక కలిగెను. ఊర్జస్వతిని శుక్రాచార్యునకిచ్చి వివాహము చేసెను. ఊర్జస్వతి వలన శుక్రాచార్యునకు దేవయాని యను పుత్రిక కలిగెను.



కాలము గడచెను. ప్రియవ్రతునికి మఱల వైరాగ్య ముదయించెను. నివృత్తి మార్గము వైపు మనస్సు మఱలెను. ఒకనాడు పుత్రులను బిలిచి వారికి సమముగ రాజ్యమును పంచి ఇచ్చెను. భోగములను, రాజ్యమును, అర్ధాంగిని మృతదేహమువలె పరిత్యజించి నారదుని మార్గము ననుసరించెను.

**సీ॥ అక్కట! యే నింద్రియములచే గట్టంగ బడి యుండి యందుల బాయలేక**
**యజ్ఞానవిరచితం బగు సర్వవిషయము లను నంధకూపంబులందు నడగి**
**తరుణులకే వినోద మృగంబ నైయుంటి యవి యెల్ల నే నొల్లననుచు రోసి**
**హరికృపచే నప్పు డబ్బిన యాత్మవి ద్యను గల్గి తన వెంట నరుగుదెంచు**
**తే॥ కొడుకులకు నెల్ల రాజ్యము గుదురుపఱచి**
**తనదు పత్నుల దిగనాడి ధనము నిడిచి**
**హరివిహారంబు చిత్తంబునందు నిలిపి**
**పరగ నల్లన నారదపదవి కరిగె.**

ప్రియవ్రతుడు అరణ్యముల కేగెను. అతని కుమారుడగు ఆగ్నీధ్రుడు రాజయ్యెను. ధర్మ పరిపాలనమును గావించి జంబూద్వీప వాసులను కన్నబిడ్డలవలె పాలించెను.

ఒకనాడు పితృలోకమును పొందించు పుత్రులను పొందవలె ననెడి కోరిక ఆగ్నీధ్రునికి కలిగెను. మందర పర్వతమున కేగి అచ్చట ఆగ్నీధ్రుడు బ్రహ్మదేవుని వేడుచూ తపస్సు చేయనారంభించెను. ఆగ్నీధ్రుని తపస్సును గాంచి కమల సంభవుండు తాను యరుదెంచక ఒక అప్సరస్త్రీని పంపెను. ఆమె పేరు పూర్వచిత్తి.

## ఆగ్నీధ్రుని చరిత్ర

ఆగ్నీధ్రుడు తపస్సు నారంభించెను. బ్రహ్మ సభలో గాయని యగు "పూర్వచిత్తి" యను అప్సర అచ్చటికి వచ్చెను. ధ్యానమగ్నుడై యున్న ఆగ్నీధ్రుడు కొద్దిగ కళ్ళు తెరచి చూసెను. చిత్తము చలించెను. మనస్సులో మన్మథుడు విహరింప సాగెను.

**క॥ సతి! నీ వెవ్వతె వీ ప ర్వతమున కేమేని గోరివచ్చిన వన దే**
**వతవో శారదవో రతి పతి పంచిన మాయవో తపస్సారమవో.**

యని పలికెను. ఆగ్నీధ్రుడు పూర్వచిత్తిని వాంఛించెను. పూర్వచిత్తి ఆగ్నీధ్రుని కామించెను. ధ్యానము స్థానే దాంపత్య జీవితము ప్రారంభమైనది. పూర్వచిత్తివలన ఆగ్నీధ్రునికి తొమ్మండుగురు కుమారులు కలిగిరి.

చిత్తములో నిలిచియున్న పూర్వవాసనలే పూర్వచిత్తి యనబడినవి. తపస్సు నారంభించిన ఆగ్నీధ్రుని పూర్వచిత్తి కలవరపరచింది. తపస్సును భగ్నం చేసింది. మనము గూడ ధ్యానము చేయుట కుపక్రమించగనే పూర్వము గాంచిన రూపములు, పూర్వము

విినిన శబ్దములు, పూర్వము అనుభవించిన విషయములు చిత్తములో మెదులును. అప్పుడు ధ్యానమును భగ్నమొనర్చుటకు పూర్వచిత్తి వచ్చిందని భావించవచ్చును.

పూర్వ వాసనలు ప్రగతి నిరోధకములు. ప్రబల శత్రువులు. వీటిని నిస్సార మొనర్పవలెనేగాని ఎరువు వేసి పెంచకూడదు. స్మృతిలో మెదిలిన గత వాసనలు నూతన పాపములకు నాంది పలుకును. వస్తువులు, విషయాలు బయట యుండును. మనస్సు వాటికి మనోహరత్వమును లోపలనుండి కల్పించును. అవివేకమనెడి తెరనుదించి వాస్తవమును మరుగు పరచును.

పూర్వచిత్తి గతములో పరవశింప జేసిన విషయములను ధ్యానసమయమున నీకు చూపెట్టును. అట్టి సమయమున నీవు అంధుడవై పొమ్ము. గతములో ఈ విషయములను గాంచినాను. అనుభవించినాను. అయినను నా వ్యామోహము తీరలేదు. సంతృప్తి కలుగ లేదు. అసంతృప్తిని, నిరాశను పంచే విషయాలను నే నెందులకు దర్శించాలి. నేను నా శ్యామసుందరుని దర్శిస్తాను. మల్లికార్జునుని ధ్యానిస్తాను అని చెప్పాలి. అలా చేసినచో పూర్వచిత్తి నీరసపడుతుంది. ధ్యానము నిరాటంకముగా సాగుతుంది.

చిత్తమును గతంలో ధ్వంస మొనర్చిన గుహ్య భాషణములు భగవత్సేవలో యుండునపుడు అప్రయత్నముగ వినిపించును. వెంటనే బధిరుడవు గమ్ము. నేను ఈ పూర్వచిత్తి పలుకులను ఆలకించను. ఆస్వాదించను. అచ్యుతుని నామ సంకీర్తనలో లభించిన ఆనందము ఈ శబ్దాలలో యున్నదా? యని నిలదీసి ప్రశ్నింపుము. పూర్వచిత్తి అదృశ్యమగును.

మనస్సును మూగగా మార్చవలె నని నీవు ప్రయత్నిస్తుంటే, నీ నుండి పలుకులను కదలించేందుకు పూర్వచిత్తి యత్నించును. అనివార్యమైనచో అనుసరింపుము. మాటలను కదలింపుము. కానీ అవి మాధవుని గూర్చిన పలుకులై యుండాలి. బిగ్గరగా సంకీర్తనము చేయుము. చెట్టునుండి పక్షులు ఎగిరి వెళ్ళునట్లు మనస్సు నుండి పూర్వచిత్తి పరారగును.

అనుభవించవలె ననెడి కోరికను రగిల్చేదియే పూర్వచిత్తి. కనుక సాధకుడు దీని విషయంలో జాగరూకుడై యుండవలెను. భోగేచ్ఛ బంధమును కల్గించును. దానిని త్యజించినచో మోక్షము లభించును.

**భోగేచ్ఛా మాత్రకో బన్ధ స్తత్త్యాగో మోక్ష ఉచ్యతే**

"భోగేచ్ఛయే బంధము. దానిని త్యజించుటయే మోక్షము" యని మహోపనిషత్తు ప్రవచించినది.

పూర్వచిత్తి తొమ్మండుగురు పుత్రులను గనెను. ఆగ్నీధ్రుని వదలిపెట్టి పూర్వచిత్తి బ్రహ్మలోకమున కేగెను. ఆగ్నీధ్రుడు తొమ్మండుగురు పుత్రులకు రాజ్యమును విభజించి ఇచ్చెను. పూర్వచిత్తిని వదలి జీవించలేక పోయెను. విషయభోగముల యందు అతనికి తృప్తి లభించలేదు.



విషయ సుఖాలలో మనిషి తృప్తి చెందలేడు. పరిమితమైన విషయాలు అపరిమితమైన ఆనందము నివ్వలేవు. భోగముల ననుభవించుట ద్వారా భోగములు నశింపవు. పైగా భోగములు వృద్ధి చెందును. పూర్వ సంస్కారములు మనస్సులో సంకల్పముల నుదయింప చేయును. వాటిని గూర్చి ఆలోచించకుండా ప్రతిపక్ష భావనతో మెలగినచో సంస్కారములు నశించును. అలాగాక సంస్కార జనిత ఊహలను గూర్చి ఆలోచించినచో తత్ఫలితముగ కర్మలు రూపు దిద్దుకొనును. నూతన సంస్కారములు ఏర్పడును. విషయాలు దూర మగును గాని విషయ చింతనము తోడుగా నిలచి బాధించు చుండును.

పూర్వచిత్తి వెడలిపోయినది. కానీ పూర్వ వాసనను విడచి వెళ్ళినది. ఆగ్నీధ్రుని మనస్సు శాంతించడము లేదు. అప్సరసను గూర్చియే ఆలోచించసాగినది. ఆమె జ్ఞాపకాల సరాలే మనస్సులో వ్రేలాడసాగినవి. అనుక్షణము అప్సరసను గూర్చియే చింతించుచుండిన ఆగ్నీధ్రుడు గతించి అప్సరస లోకమునే చేరెను.

మన గమ్యమును మనమే నిర్ణయించుకొందుము. మనస్సులోని సంకల్పాలే బ్రతుకుకు మార్గమును చూపించును. గమ్యమును నిర్ణయించును. సదాలోచన సన్మార్గమును చూపెట్టును. సన్మార్గము సద్గతిని ప్రసాదించును. దురాలోచన వలన వ్యక్తి దుర్మార్గుడగును. దుర్గతిని బొందును.

అనిత్యమైన విషయములను చింతించుట మానేయాలి. నిత్యమైన దానినే స్మరించాలి. అనిత్యమైన దేహమునందు ఆత్మభావము నుంచరాదు. బుద్ధికి సాక్షియైన సచ్చిదానంద రూపమగు ఆత్మనే ధ్యానించాలి.

**సత్యానంద స్వరూపం ధీ సాక్షిణం జ్ఞాన విగ్రహమ్**
**చింతయాత్మతయా నిత్యం త్యక్త్వా దేహాదికాం ధియమ్**

"అనిత్యమైన దేహమునందు ఆత్మబుద్ధిని త్యజించి, సదా నీవు సత్య రూపుడవనియు, జ్ఞాన రూపుడవనియు, బుద్ధికి సాక్షివనియు సదా చింతించుచుండుము" యని స్కాంద పురాణము తెలిపినది.

ఆగ్నీధ్రుడు అప్సరసలోకమున కేగెను. ఆగ్నీధ్రుని పుత్రులగు నాభి మొదలైన తొమ్మండుగురు మేరువు యొక్క తొమ్మండుగురు కన్యలను వివాహము చేసికొనిరి.

## ఋషభదేవుడు

ఆగ్నీధ్రుడు పరలోకమును జేరెను. ఆగ్నీధ్రుని కుమారుడగు నాభి లోకకల్యాణము నావిష్కరించు పుత్రుడు కావలెనని సంకల్పము చేసి యజ్ఞమును నిర్వహించెను. కల్యాణ ప్రదము లగు కర్మలన్నిటికీ యజ్ఞము నాభి వంటిది. కనుక నాభి యజ్ఞము చేయకుండా ఉండలేడు.

**వేదిమాహుః పరమం తం పృథివ్యాః యజ్ఞమాహు ర్భువనస్య నాభిం**

యజ్ఞమనేది సమస్తలోకాలకు నాభివంటిది అనగా నడిబొడ్డువంటి దనియు, అట్టి పవిత్ర యజ్ఞవేదిక భారతదేశమే ననియు వేదమాత ఘోషించినది.

నాభి తన భార్యయగు మేరుదేవితో గూడి యజ్ఞము నాచరించెను. తత్ఫలితముగ భగవానుడే వారికి పుత్రుడుగ జన్మించెను. అతడే ఋషభదేవుడు.

లోకకల్యాణార్థం చేయు కర్మలన్నియు యజ్ఞములే. అట్టియజ్ఞముల నాచరించు పుణ్యాత్ములకు జ్ఞానపుత్రు డుదయించును. అజ్ఞానము నంతరింప చేయును.

ఋషభుడనగా సర్వ శ్రేష్ఠమయు డని భావము. "పురుషర్షభః, దేవర్షభః" అనెడి పదములు సామాన్య వాడుకభాషలో యున్నవి. సర్వశ్రేష్ఠుడైనవాడు భగవానుడే. ఋషభుడు మానవాళి నుద్ధరించుట కరుదెంచిన భగవదవతారము. జ్ఞానావతారము.

**తస్య హ వా ఇత్థం వర్ష్మణా వరీయసా బృహత్ శ్లోకేన చౌజసా బలేన శ్రియా య జసా వీర్య శౌర్యాభ్యాం చ పితా ఋషభః ఇతీదం నామ చకార**

నాభి నందనుడు ధవళ కాంతితో శోభించు చుండెను. మహిత బల పరాక్రమ వీర్యాదులను జూచి ఆ బాలునకు ఋషభుడని పేరిడినట్లు భాగవతము చెప్పుచున్నది.

ప్రజల భావములకు అత్యున్నతమైన విలువ నిచ్చు నాభిరాజు తన కుమారుడైన ఋషభునిపై ప్రజలకు అమితానురాగ మున్నదని గ్రహించి సంతృప్తి చెందెను. ఋషభునికి రాజ్యము నప్పగించి తాను భార్యాసమేతుడై బదరికాశ్రమమునకు వెళ్ళెను. శ్రద్ధాభక్తులతో ధ్యానాదుల నాచరించి తరించిపోయెను.

ఋషభుడు ఇంద్రప్రదత్త యగు "జయంతి"ని వివాహమాడెను. ఆయనకు పుత్రు లుదయించిరి. ఋషభుని పుత్రులలో భరతుడు శ్రేష్ఠుడు.

**యేషాం ఖలు మహాయోగీ భరతో జ్యేష్ఠః**
**శ్రేష్ఠగుణ ఆసీద్యేనేదం వర్షం భారతమితి వ్యపదిశన్తి**

"ఋషభుని కుమారులలో జ్యేష్ఠుడైన భరతుడు శ్రేష్ఠుడు. గుణసంపన్నుడు. ఆయన పేరు ననుసరించి ఈ వర్షమును భరత వర్షమని జనులు పిలుచుచున్నారు."

ఋషభుడు భగవానుని ఆవేశావతారము. ఆయన సమస్త కళ్యాణగుణ సంపన్నుడు. సర్వత్ర సమదర్శనము జేయుచుండెను. పరుల దుఃఖమును గాంచి దుఃఖించుచుండెడి వాడు. గృహస్థాశ్రమమున జీవులెలా మెలగవలెనో ఆచరించి చూపెను. ఋషభదేవుని పరిపాలనలో ప్రజలు ఎవరును ఏ ఒక్కరిని ఏ సమయము నందును ఏదియును ఆశించ లేదని భాగవతము చెప్పుచున్నది. ప్రజల అవసరాలన్నీ ప్రభువే తీర్చుచుండెను.

ఋషభుడు తన కుమారులకు తత్త్వోపదేశము చేసెను. ఆ తరువాత వారికి రాజ్యములను ప్రసాదించెను. తత్త్వచింతనము లేని రాజు ప్రజల దురదృష్టమునకు ప్రతిరూపమని ఋషభుని అభిప్రాయము. ఋషభుడు పుత్రులకు ఇలా బోధించెను.

మానవ దేహము ప్రశస్తమైనది. విశిష్టమైన మానవ జన్మను బొంది దుఃఖానుభవము నిచ్చు కార్యములను చేయరాదు. భోగేచ్ఛ, భోగానుభవములు మానవజన్మకు లక్ష్యములు



గానేరవు. ఎందువలన అనగా అవి పశుపక్ష్యాదులకు గూడ కలవు. తపోధ్యానాదుల ద్వారా మానవుడు శుద్ధిపడాలి. ఇదియే మానవునకు ఏకైకధర్మము.

భోగముల ననుభవించు మానవుడు రోగనిలయమగు దేహమును బొందును. కర్మల యందలి ఆసక్తి కర్మాచరణకు నాంది పలుకును. కర్మలు జన్మలకు కారణములై దేహములను ప్రసాదించును. దేహిని బాధలకు గురిచేయును. కనుక కర్మలు అనుసరణీయములు గావు. జ్ఞానమే అనుసరింపదగినది.

**కం యోజయన్ మనుజోఽర్థం లభేత నిపాత యన్నష్ట దృశం హి గర్తే**

అంధుడు దారి తెలియని కారణమున గోతివైపు వెడలుచుండును. అట్టి వానిని "అలాగే వెళ్ళు" మని చెప్పుట యధర్మమే కాగలదు. అలాగే కర్మలయందు చరించు అజ్ఞానిని కర్మాచరణము నందే యుంచినచో అతనికి అపకారము చేసినట్లే యగుచున్నది.

కుమారులారా! అవిద్యను మనుజుడు అంతమొందించాలి. దానికి జ్ఞానమొక్కటియే మార్గము. సూర్యోదయము అంధకారము నదృశ్యము చేయులాగున జ్ఞానోదయము అజ్ఞానాంధకారమును అంతమొందించును.

భగవంతుని యందు సదా ఏకాంత భక్తులై మెలగవలెను. కామ్యకర్మలను త్యజింపవలెను. భగవత్కథలను ఆసక్తితో శ్రవణము చేయవలెను. కామక్రోధాలను దూరము చేసికొని, సదా భగవానుని గుణానుకీర్తనమునందు రమించవలెను. ఇంద్రియ మనోబుద్ధులను నిగ్రహింపవలెను. ద్వంద్వములను సహింపవలెను. సత్సంగమును బొంది తృప్తి చెందవలెను. దేహము అనిత్యమనెడి దృఢభావమును కలిగి యుండవలెను. భక్తి మార్గమునకు అడ్డువచ్చు వారెవరైనను త్యజింప దగినవారే. నా వలెనే మీరు గూడా ధర్మరతులై మెలగుడు. అధర్మము ననుసరింపకుడు.

**పృష్ఠే కృతో మే యదధర్మ ఆరాదతో హి మా మృషభం ప్రాహురార్యాః**

"నాయనలారా! నేను అధర్మమును ఏ నాడు దగ్గరికి రానివ్వలేదు. అందుచేత ఆర్యులు నన్ను ఋషభుడనిరి;" అని ఋషభదేవుడు కుమారులకు చెప్పెను.

ఋషభదేవుడు తన పుత్రులలో జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడునైన భరతుని రాజ్యమునం దభిషిక్తుని గావించెను. ఋషభదేవుడు అవధూత అయ్యెను. వస్త్రాదులను విసర్జించెను. ఆభరణములను త్యజించెను. ఉపాధి వినిర్ముక్తమైన జ్ఞానముతో నగరమును విడచి ఒంటరిగ పక్షివలె వెడలిపోయెను. సమస్తమును త్యజించి జ్ఞానియొక్క అద్భుతస్థితిని ప్రదర్శించి చూపెను.

ఋషభదేవుడు అవధూతయై చరించెను. జడునివలె పడియుండెడివాడు. చూచు వారిని చూడనివాడై అంధుడనిపించుకొనెను. పిలిచిన వారితో పలుకనివాడై మూగవాడయ్యెను. విననివాడై చెవిటివాడయ్యెను. పిచ్చివానివలె సంచరించు చుండెను.

దేశ సంచారియై తిరుగుచుండిన ఋషభదేవుని దుష్టమానవులు అనేక విధముల హింసించిరి. అడవి యేనుగును దోమలు బాధించునట్లు ఆయన చుట్టూముగి కష్టపెట్టు చుండిరి. కొన్నిచోట్ల జనులు ఋషభుని కొట్టెడివారు. దేహముపై మూత్రమును విడిచెడి వారు. ఉమ్మి వేసెడివారు. రాళ్ళు విసిరెడివారు. మట్టిని చల్లెడివారు. తిట్టెడివారు. ఇన్ని విధముల బాధించు చుండినను ఋషభదేవుడు బాధ నెరుగడు. నిర్మలచిత్తుడై చరించు చుండెను.

పూర్ణజ్ఞాన స్థితిలో నిలచిన ఋషభుడు ఇక కదలలేక పోయెను. సదా ఆత్మానందము ననుభవించుచు పడియుండెను. అజగర వ్రతము నవలంబించెను. లభించినదానిని ఆరగించును. వంటబట్టని దానిని విసర్జించును. ఆహార పానీయములు, మలమూత్రాదులు ఒక్కచోటనే జరుగుచుండెను. ఆ దివ్యాత్ముని నుండి బహిర్గతమయ్యే మలము నందు ఏ విధమైన దుర్గంధము లేకుండెను. పైగా సుగంధమును వెదజల్లి నట్లుండెను.

ఋషభుడు అవధూత స్థితిని సుస్పష్టముగ ఆచరించి చూపెను. వాస్తవానికి ఆయన మోక్షాతీతుడు. బంధ ముక్తుల కతీతుడు. ఆయన ఏ విధమైన సిద్ధులను ప్రదర్శించలేదు. వరించిన సిద్ధుల నన్నిటిని ఆ దివ్యాత్ముడు నివారించెను.

“పరీక్షిన్మహారాజా! బోయవాడు పక్షులను బంధించును. కానీ వాటిని విశ్వసింపడు. వదలినచో ఎగిరి వెళ్ళునని జాగరూకుడై యుండును. అలాగే మహాత్ములు ఇంద్రియ మనస్సులను స్వాధీన పరచుకొనినను వాటిని విశ్వసింపరు. ఈ కారణముగా ఋషభుడు సిద్ధులను నిరాకరించి మనస్సుకు బుద్ధి చెప్పెను.

ఋషభదేవుడు కర్ణాటక దేశమునకు వచ్చెను. అచ్చట ఒక వెదురు వనములో విహరించు చుండెను. వెదురు చెట్లు పరస్పరము రాచుకొనుట వలన అగ్ని జనించెను. అలా జనించిన దావానలము వనము నంతటిని దగ్ధము చేయుచుండెను. ఋషభదేవుడు వనమును వదలి పారిపోలేదు. వాటేసుకొనిన బిడ్డను లాలించినట్లు దరిచేరిన అగ్నిదేవునిపై దయావృష్టిని కురిపించెను. వెదురుచెట్లతో పాటు ఋషభదేవుని దేహము దగ్ధమై పోయెను. ఆ సమయమున గూడ ఆ మహాత్ముని మొగముపై నున్న చిరునవ్వు చెదర లేదు. ఋషభదేవుని ఈ దివ్యమార్గము అన్యులు అనుసరించదగినది గాదు.

**కోన్వస్య కాష్ఠా మపరోఽను గచ్ఛే న్మనోరథేనా ప్య భవస్య యోగీ**
**యో యోగమాయాః స్పృహ యత్యుదస్తా హ్యసత్తయా యేన కృతప్రయత్నాః**

“దివ్యాత్ముడగు ఈ ఋషభదేవుని మార్గమును మనస్సు ద్వారా ఏ యోగి యైనను అనుసరింప గలడా? ఏ సిద్ధులను హేయములని ఋషభుడు పరిత్యజించెనో వానిని బొందుటకై యోగులు యత్నించుచుందురు” అని శుకుడు పలికెను. అట్టి ఋషభునికి నేను నమస్కరించు చున్నానని తెలిపి ఋషభదేవుని చరితమును ముగించెను.



## భద్రుడైన భరతుడు

ఋషభుని కుమారుడగు భరతుడు రాజయ్యెను. విశ్వరూపుని కుమార్తెయగు పంచజననిని పరిణయమాడెను. ఐదుగురు కుమారులను గనెను. ప్రజలను భరతుడు పరమవాత్సల్యముతో పాలించెను. అందుచేత ఈ దేశమునకు భారతదేశ మనెడి పేరు కలిగెను.

**అజనాభం నామైత ద్వర్షం భారత మితి యత ఆరభ్య వ్యపదిశన్తి**

“పూర్వము ఈ దేశమును “అజనాభ” మని పిలిచెడివారు. భరతుడు రాజైన తరువాత “భారతదేశ” మని బుధజనులు పిలిచిరి.”

భరతుడు అనేక యజ్ఞములను చేసెను. యజ్ఞఫలము నంతటిని శ్రీకృష్ణునకే అర్పించెను. ఈ విధమైన నిష్కామకర్మ ద్వారా భరతుని మనస్సు నిర్మలమయ్యెను. దృఢభక్తి హృదయము నావరించెను. పరాభక్తి అంతర్యమున చోటు చేసుకొనెను. భగవన్నామము నుచ్చరింపగనే దేహము గగుర్పాటు చెందుచుండెను. కంఠము గద్గద మగుచుండెను. సదా మనస్సు ముకుంద పాదారవిందముల యందే లగ్నమై యుండెను. ఈ విధమైన పరాభక్తి వలన ఆయన హృదయము ఆనంద సరోవర మయ్యెను. భరతుని మనస్సు ఆ సాగరమున మునక లేయుచు సంతృప్తి చెందుచుండెను. ఈ కారణముచే బహిర్ముఖము గాలేక కర్మముల నాచరించుటకు వెనుకాడుచుండెను.

భరతుడు జింక చర్మమునే వస్త్రముగా ధరించి యుండెను. వాని కేశములు జడలు గట్టి యుండెను. సదా భగవత్సేవారతుడై యుండెను. నిజభక్త జన హృదయారవింద నివాసుడైన వాసుదేవుని యందు చిత్తమును స్థిరపరచుకొనెను. కృష్ణగత చిత్తుడైన భరతుడు ప్రాపంచిక కర్మము లాచరింపలేనివాడై రాజ్యమును సుతులకొసగి, సర్వమును త్యజించి పులహాశ్రమమును జేరెను.

రమ్యమైన ఆ యాశ్రమ ప్రదేశమున ఇందిరావిభుని హృదయమందిరమున ప్రతిష్ఠించుకొని అనుక్షణము అర్చించుకొనుచు ఆనందించుచుండెను. గండకీనదీ తీరమున గండములు తెలియని నిండు జీవితమును పండించుకొను చుండెను. సదా భగవానుని సేవించుచు తనివి తీరకయుండెను.

సీ॥ ఏ యాశ్రమంబున నిందిరాధీశ్వరు డచ్చటివారల నాదరించి
ప్రత్యక్షమున నుండు బాయక యెప్పుడు నట్టి రమ్యం బైన యాశ్రమమున
నిలిచి సాలగ్రామములు గల గండకీ నది యొందు నెంతయు గదిసి యుండు
నచ్చోట నేకాకి యగుచును భరతుండు బహువిధనవ పుష్పపల్లవముల

తే॥ నతులతులసదళంబుల నంబువులను గంధమూలాదిఫలముల గంజములను
ఘనత నర్పించి నిచ్చలు దనివిలేక సేవసేయుచు నుండె నా శ్రీశు హరిని.

భరతుడు రాజ్యమును త్యజించెను. భార్యాపుత్రులను జయించెను. పులహాశ్రమమును చేరెను. భోగముల ననుభవింపవలసిన వయస్సులో విరాగియై త్యాగమును వరించెను. త్యాగియై చరించెను. సరియైన వయస్సులో భరతుడు జ్ఞానసిరిని వరించెను.

ఉద్యోగ విరమణ తరువాత విరక్తిని పెంచుకొనవలె ననియు, అంతవరకు విషయసుఖాలలో రమించుటయే ఉద్యోగమనియు భావించు చుందురు. ఇదొక అయోమయ ధోరణి. దేహము కృశించినంత మాత్రాన మనస్సు నశిస్తుందని భావించడము శుద్ధ అవివేకము. జీవిత మంతయు ప్రతికూలంగా వర్తించిన మనస్సు వృద్ధాప్యంలో అనుకూలంగా వర్తిస్తుందని భావించడము అజ్ఞానమే అవుతుంది.

ఉద్యోగ విరమణ తరువాత భక్తిని చేయవచ్చునని భావించే ప్రబుద్ధుడు, ఈ లోగానే ప్రపంచంనుండి శాశ్వతంగా నిష్క్రమిస్తే ఎలా? అని ఎందుల కాలోచించడు. సత్యమెరుగని మనస్సునకు సద్భావాలు కలుగవు.

మమత్వము మరణ సదృశము. ఈ ప్రపంచంలో మనము తయారు చేసికొనెడి బాంధవ్యము లన్నియు ఒక్కనాడు ప్రాప్తించే మృత్యువుతో అదృశ్యమవుతాయి. తిరిగి ఏ క్షణాన కూడ స్మృతికిరావు. ఈ సత్యమును గ్రహింపలేని వ్యక్తులు మమతల వలలోచిక్కి వ్యథ చెందుచుందురు.

దేహము శక్తివంతముగ యున్నపుడే సాధన లాచరింపవలెను. ముసలితనమున ప్రక్కవారిని బాధించడమేగాని, జీవితమున సాధించే దుండదు. విషయసుఖాలు జనులను మోసం చేస్తుంటాయి. బుద్ధిని పాడు చేస్తాయి. దృష్టిని వక్రింప చేస్తాయి. స్వార్థాన్ని పెంచుతాయి. త్యాగాన్ని దూరంచేస్తాయి. బ్రతుకును అంధకార బంధురముగ మారుస్తాయి.

సత్యం తెలిస్తే మనిషిలో విరక్తి జనిస్తుంది. వివేకము వైరాగ్యము నందిస్తుంది. ముసలితనములో ఏర్పడే భక్తి నిజమైన భక్తి కాదు. అది మూలిగే భక్తి. వయసు మళ్ళిన తరువాత లభించే వైరాగ్యము నిజమైన వైరాగ్యము గాదు. ఫలించని ఆశ లందించిన నిరాశయై యుంటుంది.

విద్యార్థులు పరీక్షలు వ్రాస్తారు. అంతేగాని పదవీ విరమణ జేసిన ఉద్యోగులు గాదు. భక్తి వైరాగ్యాలకి నిజమైన పరీక్ష యౌవనములోనే జరుగుతుంది. గెలుపో, ఓటమియో అక్కడే తేలిపోవాలి. ముసలితనములో జరిగే పరీక్ష వాస్తవానికి భక్తికేగాని వ్యక్తికిగాదు.

ప్రతివ్యక్తీ తన జీవితములో ఎన్నో వస్తువులను చేతులతో ముట్టుకుంటున్నాడు. కానీ ఏదియును చేతిలో నిలవడము లేదు. అంతిమ క్షణాన రిక్తహస్తాలే మిగులుతున్నాయి. నష్టరూపాలే గోచరిస్తున్నాయి. బ్రతుకును చేజేతుల పాడుచేసుకోవడమంటే ఇదియే సుమా!

సమయము వడచిపోతున్నది. అవకాశములు ఒకదాని వెంబడి ఒకటి జారిపోతున్నవి. ఆయుష్షు కారిపోవుచున్నది. కానీ మనిషి మారేదెప్పుడు?



ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఒక ఉద్యోగి నా వద్దకు వచ్చాడు. "స్వామీజీ! మీ నుండి చిన్న సలహా కావాలి" అని ప్రారంభించి ఒక మహోపన్యాసాన్ని దంచాడు. ఇంతకీ సారాంశమేమిటి? తాను ఉద్యోగవిరమణ చేశాడు. ఆస్తి ఉంది. బిడ్డలంతా స్థిమితముగా స్థిరపడి పోయారు. రెండువేల రూపాయల వరకు పెన్షన్ వస్తుంది. ఆశ్రమంలో ఉండి పోదామనుకున్నాడట. కానీ వేరే ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగము వచ్చే అవకాశాలున్నాయి. వస్తే సరేసరి. లేకపోతే ఆశ్రమానికి వచ్చి ఉంటానంటాడు.

అతనిని జూచి నాకు జాలేసింది. నేనేమీ మాట్లాడలేదు. చెప్పండి - చెప్పండి యని గుచ్చి గుచ్చి అడుగుతుంటే చెప్పక తప్పింది గాదు. చెప్పేశాను. "అయ్యా! మిమ్మల్ని ప్రభుత్వం ఉద్యోగంనుండి విరమింపచేసింది. దాని అర్థమేమిటి? ఇక మీ సేవలు నిరుపయోగము అని. మీరు ఈ సత్యాన్ని మరచి మళ్ళీ ప్రయత్నిస్తున్నారు. మంచిదే. మీకు మీరు కోరుకొనే కంపెనీలో ఉద్యోగము రావలెనని భగవంతుని ప్రార్థిస్తాను. ఎందుకంటే మిమ్మల్ని నేను ఆశ్రమంలో ఉంచుకోను గనుక" యన్నాను. ఆ మాటకు చలించి పోయిన ఆ వ్యక్తి "ఎందుకని స్వామి?" యని ప్రశ్నించాడు.

"ఈ ఆశ్రమం సాధనాలయం. అనాథ శరణాలయం కాదు" అని చెప్పి, ఆ చర్చను అంతటితో ముగించాను.

బాధ్యతలన్నీ తీరిపోయాయి. అయినా బరువులు మోయాలనే బుద్ధి చావలేదు. ఆశలు అడుగంటలేదు. వ్యామోహాలు చావలేదు. మూడునాళ్ళ ముచ్చటైన ఈ జీవితములో సంపాదనలు, గౌరవాలు, పేరుప్రతిష్ఠలు ఏ పాటివి?

భరతునికి యౌవనము ఉంది. రాజ్యము ఉంది. భార్య ఉంది. భోగములున్నాయి. కానీ వాటన్నిటిపై ఇచ్ఛలేదు. అందుచేత సమస్తమును త్యజించి సర్వేశ్వరుని ఆశ్రయించాడు. అభ్యాసముతో తోడైన సంస్కారాలను ఆలోచనతో, ఆచారముతో పోగొట్టుకొనినాడు.

ప్రతివ్యక్తి ఒకనాడు త్యాగి కావలసిందే. ప్రతివ్యక్తి సమస్తమును విడువవలసిందే. ఈ సత్యమును గ్రహించి ఏ క్షణాన్నైనా త్యజించేందుకు సిద్ధంగా యుండువాడే సాధకుడు. భక్తుడు. వస్తువులు, విషయాలు మనలను త్యజిస్తే మనకు దుఃఖం కలుగుతుంది. మనము అవగాహనతో వదలిపెడితే సుఖం లభిస్తుంది. భార్యాభర్తలలో ఒక్కరే న్యాయస్థానంలో విడాకులకు వినతిపత్రాన్ని సమర్పిస్తారు. విడాకులైన తరువాత వారిరువురు విడిపోతారు. ఆ సమయాన ఒకరు తృప్తితో, మరొకరు అసంతృప్తితో గోచరిస్తారు. ఏదైనా అంతే. ఆసక్తి లేనపుడు ఇంద్ర పదవియైనా ఇంపుగా యుండదు.

విషయాలు, వ్యక్తులు, వస్తువులు ఎంతకాలం తోడుగా యుండినా ఒకనాడు దూరంగాక తప్పవు. ఏవి దగ్గరుండినా ఫరవాలేదు. అవి మనస్సుకు దగ్గర గాకుండా యుండాలి. ఉండినవి ఉంటాయి. ఊడేవి ఊడిపోతాయి. పోయేందుకు వచ్చినవి యుండిననూ ఒకనాడు పోయేవియే. పోక తెలియనిది, రాకలేనిది ఏదియో అదియే నీకు నిజమైన తోడు. అది పరమాత్మయే గాని మరొకటి గానేరదు. ఈ సత్యమును గ్రహించుట

చేత భరతుడు సమస్తమును త్యజించి పరమాత్మనే పట్టుకున్నాడు. సంసారమున తీవ్ర విరక్తి ఉదయించినపుడే సన్యసించాలి.

### యదహరేవ విరజేత్త దహరేవ ప్రవ్రజేత్

"ఎవడు సంసారము నందు విరతుడో వాడే సన్యాసి గావలెను" యని జాబాలోపనిషత్తు తెలిపినది.

ఒకనాడు భరతుడు మహానది యందు స్నాన మాచరించి, నదీతీరమున గూర్చుండి ధ్యానమగ్నుడై యుండెను. ఆ సమయమున గర్భిణీయగు లేడి జలార్థినియై నదీ తీరమునకు వచ్చినది. ఆ హరిణి జలమును పానము చేయుచుండెను. ఇంతలో సింహము భయంకరముగ గర్జించెను. ఆ గర్జనము నాలకించిన హరిణము కంపించినదియై, భయముతో నదిని దాటుటకు దుమికెను.

హరిణి గర్భిణియై యున్నందున దుముకునపుడు నధిక భయముచే దాని గర్భము నందున్న జింకపిల్ల యోనిద్వారము నుండి బహిర్గతమై నదిలో పడెను. హరిణి మరియొకవైపు తీరమునుజేరి చనిపోయెను. లేడిపిల్ల జలప్రవాహములో కొట్టుకొని పోవుటను గాంచెను. కరుణార్ద్ర చిత్తుడైన భరతుడు ఆపద్బాంధవునివలె జింకపిల్లను బయటకు తీసెను. తల్లిని పోగొట్టుకొనిన హరిణ శిశువును తన ఆశ్రమమునకు గొనిపోయెను.

హరిణ పోతముపై భరతునకు ప్రేమ అధికమయ్యెను. ఈ పసికూనకు తల్లి లేదు. దీని నెవ్వరు పోషింతురు? నేను దప్ప దీనిని పోషించు వారెవరు? యని భరతుడు భావించెను.

పోషకుడు తానని మనుజుడు భ్రమించుచుండును. సంసారము నంతటిని నేనే పోషించు చున్నాను యని ప్రగల్భములు పలుకు చుండును. తాను ఎవరి దయపై ఆధారపడి జీవించు చున్నాడో మరచిపోవును. తల్లి గర్భంలో అయోమయంగా యున్న తనను రక్షించిన దెవరో మరచిపోవును. నేను ఈ విషయమును సాధించితినని గర్వించును. దానిని సాధించుటకు సాధనమగు బుద్ధి నెవరిచ్చెనో జ్ఞాపకము పెట్టుకొనడు. తన అందమును జూచుకొని మురిసిపోవుచు, అందమును అందించిన వానిని మరచిపోవును.

మన మేదైన సత్కార్యము నొనరించి నపుడు అది భగవదనుగ్రహమని భావింపవలెను. అహంకారము అనర్థదాయకమని మరచిపోరాదు. హరిణ శిశువును భరతుడు రక్షించుట మంచిదే, గాని దానిని రక్షించువాడు తన కన్నను వేరుగా లేడని భావించుట సరిగాదు. ఈ ఆలోచన మనస్సులో వాసనను తయారుచేయును.

రాజ్యభారము వహించవలసిన రాజైన తాను విరాగియై రాజ్యమును త్యజించెను. గొప్పదైన రాజ్యమును త్యజించగలిగెను. కానీ హరిణ పోతమునందు అభిమానమును పెంచుకొనెను. వాసన ప్రారంభములో తరంగమువలె గన్పించును. కాలక్రమేణ సాగర రూపమును ధరించును. ఒకరిపై దయ చూపుటకు మనుజుడేపాటి వాడు? అందరు



సర్వేశ్వరునిపై ఆధారపడి యున్నారు. దయచూపుట తప్పుగాదు. అభిమానమును పెంచుకొనుట అనర్థదాయకము.

భరతుడు హరిణ శిశువును ఆశ్రమములో పెంచుచుండెను. దానిని లాలించు చుండెను. పాలించు చుండెను. పోషించు చుండెను. దానితో క్రీడించు చుండెను. కుక్కను పెంచడము తప్పు లేదు. దానితో క్రీడిస్తూ కుక్కలా మొరగడం మంచిదికాదు. ఈ విధమైన జీవనమును మనము అభిలషించు చున్నామని భగవానుడు తలచినచో ఆ తరువాత మన బ్రతుకు భారమగును.

మృగశిశువుపై ప్రేమ పెరుగుచుండగ అతని వ్యక్తిగత సాధన క్షీణించుచుండెను. పూజకు ఫలపుష్పాదులను దెచ్చుటకు అరణ్యమున కేగినచో క్రూరమృగములు హరిణపోతము నేమి చేయునో యని చింతించి ఆయా కర్మములను త్యజించెను. అది ఎగురుచుండగా భరతుడు గూడ గంతులు వేయును. కొంతసేపు దాని నెత్తుకొని నడచును. కొంతసేపు దానిని యెదపై పరుండ బెట్టుకొని పాటలు పాడును. మరికొంతసేపు ఒడిలో ఉంచుకొని "బడికి పోయేదెప్పుడు?" అని దాని నడుగును. చుంబనాదులతో సంతసించును.

ఇచ్చట అతిముఖ్యమైన విషయమును మనము గ్రహింపవలెను. తన ముత్తాతయగు అగ్నీధ్రుడు పూర్వచిత్తి అప్సర వలలో జిక్కి తపస్సును పాడుచేసికొనెను. పూర్వసంస్కారములతో గూడిన చిత్తమే పూర్వచిత్తి అప్సరయని గ్రహించితిమి. గతములో తయారైన వాసనలు ఈ నాడు సాధనను వక్రింప జేయును. ఇదియే పూర్వచిత్తి అప్సర యనబడినది.

భరతుడు గతంలో పిల్లలను పోషించియుండెను. పిల్లల నెత్తుకొని యుండెను. లాలించి యుండెను. పాలించి యుండెను. అదియే ఇప్పుడు తొంగి చూసినది. పూర్వచిత్తి అప్సర రంగప్రవేశము చేసినది. మృగశాబకము క్రొత్తది గావచ్చు. వాత్సల్యాది ప్రేమలు పాతవియే. గతరుచులే. గతించని అభిరుచులే.

ప్రాపంచిక విషయానుభూతులు ధ్యానములో ప్రతిబంధకములే యని మరువరాదు. అలజడి జీవితమును గడిపిన వాడు హాయిగా నిద్రపోలేడు. వాసనలను హృదిలో నిక్షిప్త మొనరించుకొనినచో అది ధ్యానములో విక్షేపమును కల్పించును. హోరుగాలిలో దీపము ఆరిపోవును. వాసనల హోరుగాలిలో ధ్యానదీపము ఆరిపోవును. భక్తిదీపము ఆరిపోవును.

భరతుడు అర్చన కుపక్రమించును. ప్రతి అరనిముషమునకు మృగశిశువువైపు చూచును. కళ్ళు మూసి ధ్యానము చేయును. కొన్ని క్షణాలు కాగానే కళ్ళు తెరచి హరిణ శిశువును గాంచును. అది క్షేమముగానే యున్నదని భావించి ధ్యానము చేయును.

లేడిపిల్ల ఆశ్రమములో లేదు. భరతుని మనస్సులో చేరిపోయింది. ఇంటిలో ఎందరున్నా ఫరవాలేదు. కానీ మనస్సులో మాధవుడు తప్ప మరెవ్వ రుండకూడదు. సమస్తమును త్యజించి భరతుడు అరణ్యమునకు వచ్చెను. కానీ వాత్సల్యమనెడి వాసన పూర్తిగ నశింపలేదని గ్రహించలేదు. ఏకాంతమున వసించుచున్నను వాసనయనెడి అయస్కాంతముచే ఆకర్షింపబడెను. తనకు తెలియకుండగనే ఆ వాసనను వృద్ధి

చేసికొనుచుండెను. భరతుని ఆకర్షించినది మృగశాబకము గాదు. తనలో నిలిచియున్న పూర్వచిత్తియే. సంస్కారముల స్వరూపమే. వాసనా స్వరూపమే.

సంధ్యా సమయమున గండకీ నదీతీరమున ఆసీనుడై **"సర్వేజనా స్సుఖినో భవన్తు"** యని భరతుడు చెప్పుచుండెడి వాడు. ఇప్పుడు ఆ భావన అదృశ్యమైనది. **"మృగ శిశువునకు శుభము కలుగు గాక"** యని ప్రార్థించుచున్నాడు.

ధన నష్టమును గాంచి లోభి కలవరపడి కలత చెందునట్లు హరిణ శాబకము కొన్నిక్షణాలు కనపడక పోయినచో యుద్విగ్న మనస్కుడై భరతుడు తల్లడిల్లుచుండెను. అది తిరిగి కనిపించునంత వరకు దుఃఖించుచుండెను.

"నా హరిణము క్షేమముగా యుండునా? దానిని తోడేలు తినలేదుగదా? అయ్యో! దిక్కులేని హరిణము నన్నాశ్రయించినది. నేను క్రూరుడను. ద్రోహిని. హరిణమును ఒంటరిగ వదలితిని. భగవాన్! నా మృగశాబకము మృతి చెందలేదు గదా? నిర్భయముగా మఱల లేత పచ్చికను దినుచు ఆశ్రమప్రదేశమున ఆనందముగా సంచరించునా? ఆ మంజుల మనోహర దృశ్యమును గాంచు పుణ్యము నా కున్నదా?" యని విలపించును.

ఈ విషయమును సాధారణముగ మనము ప్రతి ఇంటి యందును గాంచుచుందుము. బిడ్డలను సంతకు పంపి తల్లిదండ్రులు సంతాపముతో కుమిలిపోవు చుందురు. నా బిడ్డ ఇంకారాలేదు. ఏ వైపరీత్యము సంభవించలేదు గదా? యని వ్యాకుల చిత్తులగుచుందురు. వాసన ప్రబలమైనది. ఆ ఆలోచనలే ఆశ్రమ జీవనంలోగూడ భరతునికి కలుగుచున్నవి. అందుచేతనే గృహస్థాశ్రమము పవిత్రమని చెప్పుదురు. గృహస్థాశ్రమమున వాసనలను నశింప జేసికొనినచో సన్యాసము సునాయాస మగును.

లేని ప్రమాదమును మనస్సు ఊహించును. లేని దానిని ఉన్నట్లు జూచును. మనస్సు ప్రమాదములకు నిలయమై యున్నందున ప్రమాదములనే దర్శించును. మనస్సులో కదలే అనవసర సంకల్పము లన్నియు పూర్వచిత్తి అప్సరయేనని భావింపవలెను. మృగ శాబకమునకు ఏమి ప్రమాదము వాటిల్లెనో యని భరతుడు వ్యథచెందును.

**క॥ కట్టా! యీ యాశ్రమమున బుట్టినతృణచయము మేసి పొదలినహరిణం**
**బిట్టట్టు దిరుగుచుండగ బట్టి మృగేంద్రుండు గొట్టి బాధించె నొకో!**

**"నా హరిణము ఎప్పుడు వచ్చి నన్ను సంతోషపెట్టును? ఎగురుచు, దుముకుచు నన్నెప్పుడు పంతపమున ముంచును? నేను ధ్యానము చేయు సమయాన తన కొమ్ములతో నన్నెప్పుడు గోకును? నేను పూజాది కార్యములందు నిమగ్నమై యుండగ, పూజా ద్రవ్యంబులను హరిణి వాసనచూడగా కోపించిన నేను తీవ్రముగా కుమారుని జూచినట్లు చూడగా, భయపడినట్లు దూరంగా వెళ్ళి, మళ్ళీ నేను ప్రేమతో పిలువగనే చెంగు చెంగున గంతులు వేయుచు నన్ను సమీపించి మూర్కొనే మృగశాబక క్రీడల నే నెప్పుడు దర్శింతును?" అని భరతుడు విలపించును.**



ఆహా!....... ఏమి ఈ విచిత్రమైన ప్రారబ్దము? విఘ్నము లేకుండా ధ్యానము జరుగవలెనని భావించవలసిన తపస్వి ధ్యానమునకు విఘ్నము కలుగవలెనని యోచించుటయా? భగవత్పూజ కుపకరించు పూజాద్రవ్యములను మృగశాబకము మూర్కొనవలెనని సంకల్పించుటయా? పూర్వచిత్తి అప్సర నాట్యభంగిమలు మనస్సునకు అందునవి గావు. మాయానర్తకి విన్యాసాల ముందు మానవుడు కీలుబొమ్మయే.

యోగానుష్ఠానము అయోమయమయ్యెను. అర్చన అదృశ్యమయ్యెను. పారాయణము పలాయనమయ్యెను. ధ్యానము దారి తప్పెను. కీర్తన కనుమరుగయ్యెను. తపస్సు తరలిపోయెను. సర్వము హరించిపోగా హృదయములో హరిణ శాబకమే నిలచియుండెను. అంతటి తపస్వియగు భరతుడే అలా అయినచో సామాన్యుల విషయము ఏమి చెప్పగలము? వాసనలు బలీయమైనవి యని శుకబ్రహ్మ పరీక్షిన్మహారాజునకు చెప్పుచున్నాడు.

**సీ॥ జననాథ! మున్ను మోక్షవిరోధమని పాయ గారాని పుత్రాదికంబు నెల్ల**
**బాసి తపస్వియై భరతుండు హరిణశా బకపోషణంబున బాలనమున**
**నటలాలనప్రీణనానుషంగంబుల మూషకబిల మతిరోషమునను**
**సర్పంబుసొచ్చిన చందంబునను యోగ విఘ్నంబు మిక్కిలి విస్తరిల్లె**
**ఆ॥ గాన యెంతవానికైనను గాలంబు గడవ రామి నట్లు గాకపోదు**
**పరమమునులకైన బాయవు కర్మంబు లొరు లనంగ నెంత నరవరేణ్య!**

సంసారమును వదలి మానవు డెక్కడికి పోగలడు? ఎక్కడికెళ్ళినా సంసారమే తయారగును. వాసనా పరిశ్రమలను లోపల నిలుపుకొని ఆశ్రమాల కెళ్ళినా అవి కూడా శ్రమలుగనే మిగులుతాయి. భరతుడు మృగశాబకము యొక్క ఆలోచనలో కాలమును హరింపజేసికొనును. కానీ కాలుడు తన కార్యమును తప్పక ఆచరించును. నీవు ఏమి చేయుచున్నావని యముడు ఆలోచించునా?

ఎలుక కన్నములో సర్పము ప్రవేశించినట్లు ఆపుటకు వీలులేని కాలసర్పము భరతుని సమీపించి యుండెను. ప్రతి మనిషిని మృత్యువు పొంచి యుండును. ఈ సత్యము నెరుగలేక జీవులు కాలమును వృథా చేసికొను చుందురు.

మృత్యువు ఏక్షణమైనను రావచ్చును. ప్రతిక్షణమును మనుజుడు బాగుచేసికొనినచో మృత్యువు బాగుపడును. జీవితకాలమున మనము దేనిని గురించి చింతింతుమో మృత్యు సమయమున అదియే మదిలో మెదలును.

భరతుని మృత్యువు సమీపించెను. అట్టి సమయమున గూడ మృగశాబకము తన కెదురుగ కూర్చుని పుత్రుని వలె చింతించు చున్నట్లు భరతుడు భావించు చుండెను. కాలానికి ధర్మమే గాని దయ తెలియదు. కనికర మెరుగని కాలము భరతుని కబళించెను. మహానుభావుడైన భరతుడు మృగశిశువుపై నున్న ప్రేమచేత ప్రపంచమును, మృగశాబకమును, తనదేహమును పరిత్యజించి సామాన్యుని వలె మరణించెను.

హరిణమును స్మరించుచు మరణము ననుభవించుట చేత తిరిగి జన్మము తప్పదయ్యెను. భరతుడు తిరిగి జన్మించెను. మృగమును చింతిస్తూ మరణించినందున మృగ జన్మమే యెత్తెను.

భరతుడు జింకయై జన్మించెను. కాని ఆ లేడికి పూర్వజన్మ స్మృతి యుండెను. నేను ఈ గండకీ నదీతీరముననే ధ్యానము చేసెడివాడను. ఈ నదియందే నేను హరిణ శాబకమును రక్షించితిని. పెంచితిని. పోషించితిని. దానితోపాటు నూతన ప్రారబ్ధమును గూడ పోషించుకుంటిని. రాజ్యమును త్యజించి, భార్యాపుత్రాదులను పరిత్యజించి, ఏకాకినై వాసుదేవ నామామృతపాన చిత్తుడనై జితేంద్రియుడ నైతిని! ఆహా! ప్రారబ్ధము ఎంత బలీయము? వాసన ఎంత బలవత్తరము! మృగశాబకముపై ప్రేమను పెంచుకొని మృగజన్మ నెత్తితిని. యోగభ్రష్టుడ నైతిని. ధ్యాన పతితుడ నైతిని. ఇలా చింతించుచు హరిణి రూపమున యున్న భరతుడు నిర్వేదమును పొందెను.

మృగరూపమున యున్న భరతుడు మటల పులహాశ్రమము చేరెను. ఉదాసీన వైఖరి నవలంబించు చుండెను. గత జన్మలో చేసిన తప్పిదమును తిరిగి చేయకూడదని జాగ్రత్త పడి యుండెను. ఉన్న ప్రారబ్ధము ననుభవింప వలెనే గాని నూతన ప్రారబ్ధమును తయారు చేసికోగూడదు యని దృఢముగ భావించెను. సాంగత్య దోషము సర్వానర్థములకు మూలమని గ్రహించెను.

బాల హరిణము ముద్దుగ నుండెను. అది నిత్యము గండకీ నదిలో స్నానమాచరించును. బ్రహ్మ ముహూర్తముననే నిద్రలేచును. సూర్యుని ఎదుట నిలబడి చేతులెత్తి నమస్కరించలేని తన నిస్సహాయతకు చింతించుచు కన్నీరుకార్చును. మహాత్ములరుదెంచునపుడు వారిని రెప్పవాల్చకుండ వీక్షించుచుండును. గత జన్మలో హరిణమును గాంచి భ్రష్టమైన దృష్టిని మహాత్ముల సందర్శనము ద్వారా బాగుచేసికొన వలెనని భావించును.

ఆకలివేసినచో ఎండుగడ్డిని తినును. పచ్చిగడ్డిని తినదు. పచ్చిగడ్డిపై క్రిములుండినచో అవి నశించునేమో యని ఆలోచించును. ఈ పాపము వలన మరొక జన్మ వచ్చునేమో యని భయపడును. పాపమును చూసి భీతి చెందువారు తప్పక పుణ్యాత్ములగుదురు. పునీతులగుదురు.

సంకీర్తన చెవిని పడినచో ఆశ్రమ ద్వారమున నిలబడి గగుర్పాటు చెందుచు, ఆనందాశ్రువులను రాల్చుచుండును. ఏకాదశినాడు అది భోజన మారగించదు. ఆహా! పశుజాతిలో పుట్టినను పవిత్ర సంస్కారాలు నశింపవు.

పశుపక్ష్యాదులలో గూడ జన్మాంతర సంస్కారముల ప్రభావమున మహాత్ములుదయించే అవకాశము గలదు. అందుచేత సాధకులు పశుపక్ష్యాదులను హింసింపకూడదు. హేయముగా నిందించరాదు. పశువులో గూడ నిలుచుని పరమాత్మ భక్తునికి దర్శనమొసగును. ప్రహ్లాదునికి ఏనుగుయందు, సర్పమునందు నారాయణుడే గోచరించెను.



హరిణికి అవసానదశ సమీపించెను. అది తెలిసి బాల హరిణము గండకీ నదికి వెళ్ళెను. ఆ పవిత్ర తీర్థమున స్నానమాచరించెను. నదీ తీరమున ఆసీనమై ధ్యానమగ్నురాలయ్యెను. కాలుడు సమీపించగా ప్రశాంతముగా ఈశ్వర ధ్యానములో కళ్ళుమూసెను.

## భరతుడు బ్రాహ్మణుడై జన్మించుట

భరతుడు ఒక బ్రాహ్మణ శ్రేష్ఠునికి కుమారుడుగ జన్మించెను. ఆంగీరస గోత్రుడైన యా బ్రాహ్మణుడు పవిత్రుడు. శమదమ వేదాధ్యయన తత్పరుడు. దాన ధర్మముల యందు ఘనుడు. అసూయలేనివాడు. వినయవంతుడు. భక్తి తత్పరుడు.

సద్గుణ సంపన్నులకే సన్మార్గులైన పుత్రులు జన్మింతురు. సత్పుత్రులు కలుగవలెనని ఆలోచించువారు సదాచారము నలవరచుకొన వలెను. సన్మార్గ వర్తనులై యుండవలెను.

ఆత్మజ్ఞుడైన ఆ బ్రాహ్మణునికి ఇరువురు భార్యలు గలరు. జ్యేష్ఠభార్య వలన తొమ్మండుగురు పుత్రులు జన్మించిరి. వారును ఆచారవంతులై, విచారవంతులై తండ్రితో సమానులైరి. ఆ బ్రాహ్మణుని కనిష్ఠ భార్య ఒక పుత్రుని, ఒక పుత్రికను కవలలుగ ప్రసవించినది. వీరిరువురిలో పుత్రుడు భరతుడయ్యెను. మృగ జన్మను త్యజించి బ్రాహ్మణోత్తముడుగ జన్మించెను. ఇదియే ఈ మహాత్ముని చివరి జన్మము.

ఎవరికి బాల్యముననే భక్తి ఉదయించునో వారిది చివరిజన్మ కాగలదని శాస్త్ర వచనము. భరతునకు పూర్వజన్మ స్మృతి యుండెను. మృగముగ జన్మించిన విషయము జ్ఞాపక ముండెను. అందుచేత ఈ జన్మలో నూతన సంస్కారములను, వాసనలను లేకుండా జీవింపవలెనని భావించిన భరతుడు జడునివలె, మూగవానివలె మెలగసాగెను.

బ్రాహ్మణుడు భరతుని యందు పుత్రప్రేమను పెంచుకొనెను. కానీ చివరి జన్మ ననుభవిస్తున్న భరతునికి అది ఇష్టము లేకుండెను. సంపర్కము లన్నియు సంస్కారములై నూతన జన్మను ఆవిష్కరించునని అతడు భయపడుచుండెను.

తండ్రి భరతునకు ఇష్టము లేకున్నను ఉపనయన సంస్కారము చేయించెను. తండ్రి మంత్రములను వల్లించ మనినచో వాటిని విరుద్ధముగ వల్లించును. మలమూత్రములను విడచిన పిదప శౌచాదులను కూడా ఆచరింపకుండెను. గాయత్రిని బోధింప యత్నించిన తండ్రి యొక్క కృషి యంతయు నిష్ఫలమాయెను. కుమారుడు గొప్ప పండితుడు గావలెనని తండ్రి ప్రయత్నించెను. కానీ ఫలితము సిద్ధింపదయ్యెను. ఈలోగా మృత్యువు సమీపించెను. తండ్రి మరణించెను. తల్లి తండ్రితో పాటే మరణించెను.

తండ్రి మరణానంతరము సోదరులు భరతుని విద్యాభ్యాసాది విషయముల యందు శ్రద్ధ చూపకుండిరి. జడుడు వలె చరించు భరతుని జడ భరతుడని పిలువసాగిరి. సోదరులందరు వేదముల యందలి కర్మకాండమునకే పరిమితమై యుండిరి. జ్ఞానకాండకు సంబంధించిన భరతుడు వారికి అవగతము గాకుండెను. జనులు రకరకములైన మాటలతో భరతుని అవమానించు చుండిరి.

ఎవరైనను పలకరించినచో భరతుడు పలికేవాడుగాడు. గతజన్మలో పలుకు తెలియని మృగ శాబకముతో గూడ పలికిన ఫలితంగా మృగజన్మ నెత్తవలసి వచ్చినది. కనుక ఈ జన్మలో ఎవరితోను పలుక గూడదని భరతుడు నిర్ణయించుకొనెను. ఒకవేళ మాట్లాడవలసి వచ్చినచో భక్తులతో మాట్లాడాలని, భగవంతునితో మాట్లాడాలని భావించెను.

భరతుని జడుడని భావించి కొందరు అతనిచేత పనులు చేయించు కొనెడివారు. భరతుడు వినమ్రుడై వారు చెప్పిన పనుల నాచరించెడివాడు. వారందించిన ఆహార పదార్థ మును భుజించెడివాడు. రుచిపై అభిరుచి లేకుండా భుజించు చుండెడివాడు.

భరతుడు దేహమును వస్త్రములతో కప్పుకొనడు. శీతోష్ణములకు కలత చెందడు. భూమిపైననే శయనించెడి వాడు. స్నానము లేనందున దేహము మలినమై యుండెను. కౌపీనమును మాత్రమే ధరించి యుండెడివాడు. తండ్రి ధరింపజేసిన యజ్ఞోపవీత ముండెడిది. అతనిని బ్రాహ్మణాధముడని పిలిచెడివారు.

ఇతరులు అతనిచేత పనిచేయించుకొనెడి వారు. అదిగాంచి సోదరులు గూడ పని చేయించుకొనెడివారు. సోదరులు బియ్యపునూకను, తవుడును, వంటపాత్రలలో మిగిలియున్న మాడును పెట్టెడివారు. భరతుడు అద్దానిని అమృతముగ స్వీకరించెడి వాడు.

**తే॥ అతులదివ్యాన్న మైన మృష్టాన్నమైన నెద్ది వెట్టిన జిహ్వాకు హితముగానె**
**తలచి భక్షించుగా కొండుదలచి మిగుల బ్రీతి సేయడు రుచులందు బెంపుతోడ.**

వాక్కును అవసరమైన విషయములకే వినియోగించుకొన వలెనని భరతుడు తెలుపును. ఆహారమును రుచి చూడకుండ భుజింపవలెనని తినుటను నేర్పెను. దారిలో నడచునపుడు జాగ్రత్తగ చూపి నడచును. క్రిములేవైనను కాలిక్రింద నలిగిపోవునేమోయని శంకించుచు భూమిపై పాదము మోపును. చివరిజన్మలో దేహేంద్రియ మనోబుద్ధులు అతి సుకుమారము లగును.

వృషలపతి యగు రాజొకడు పుత్రవాంఛతో కాళికాదేవికి నరపశువును బలిగా ఇచ్చుటకు నిర్ణయించెను. ఎవరినైన ఒక నరుని దీసికొని రమ్మని రాజాజ్ఞాపించెను. ఒకచోట భటులకు భరతుడు కనిపించెను. అతనిని బంధించి కాళికాలయమునకు గొనిపోయిరి.

వామాచారులు ఈ సంప్రదాయము ననుసరించు చుందురు. బలిదానము శ్రేష్ఠమైనది. కానీ జంతువులను, మానవులను బలి ఇవ్వగూడదు. తల్లియగు జగజ్జనని బిడ్డల రక్తమును చూడవలెనని వాంఛింపదు. బలి ఇచ్చుట యనగా మనలోని కామక్రోధాది అరిషడ్వర్గములను బలిఇచ్చుట యని భావము.

చోరులు భరతుని స్నానము చేయించిరి. నూతన వస్త్రములచే దేహమును గప్పిరి. అలంకరణములను జేసిరి. భరతుని తీసికొని వెళ్ళి కాళికాదేవి ముందుంచిరి. తలను క్రిందికి వంచమనిరి. భరతుని వధించుటకు భయంకరమగు ఖడ్గమును ధరించిరి.



జగజ్జనని యగు చండిక విగ్రహము నుండి వ్యక్తమైనది. చోరులవద్ద నున్న ఖడ్గము చేబూని వారి మస్తకములను ఖండించినది. భక్తులకు ఎవ్వరూ హాని కల్పించలేరు. రెండు చేతులతో హాని చేసేందుకు మనుజులు యత్నించినచో వేయి చేతులతో భగవానుడు రక్షించును.

"పరీక్షిన్మహారాజా! భాగవతులు, పరమహంసలు నైన మహాత్ములు ప్రాణాపాయస్థితిలో కూడ కలతచెందరు. ఇది వారికి సామాన్యమైన విషయము" యని శుకబ్రహ్మ చెప్పెను.

మహాత్ముల నెవరైతే హింసింతురో వారే హింసింపబడుదురు. మహితాత్ముల వైభవము నిత్యము. సత్యము. నిరంజనము.

**క॥ ధరలోన నెవ్వ రేనియు ధరణీసురవరుల కెగ్గు దగ దలచిన వా**
**రరయగ జెడుదురు నిక్కము హరి ధరణీసురవరేణ్యు లం దుండుటచేన్.**

## భరత రహూగణుల సమాగమము

ఒకనాడు సింధుదేశపు రాజగు రహూగణుడు బ్రహ్మవిద్యను బొందుటకై కపిల మహర్షి ఆశ్రమమునకు వెడలుచుండెను. పల్లకిమోయు బోయీలలో ఒకడు పారిపోయెను. మరియొకనిని వెంటనే సిద్ధము చేయుమని రాజు తెలిపెను. వాహకుని కొరకు సైనికులు వెదకుచుండగ వారికి భరతుడు కనిపించెను.

ఇతడు దృఢకాయుడై యున్నాడు. ఇతడు బరువును మోయగలడని భావించి బలవంతముగ భరతుని రాజుయొక్క పల్లకి వద్దకు తీసికొని వచ్చిరి. నాల్గవ వాహకునిగ భరతుని నియమించి బోయీలు పల్లకిని మోయుచుండిరి.

విధి బలీయమైనది. ఒకనాడు పల్లకిలో ఊరేగిన భరతుడు ఈనాడు పల్లకిని మోయుచున్నాడు. అయినను భరతుడు కలత చెందలేదు. దేహాభిమానమునకు దూరుడైన భరతునికి కర్మలలో నీచోన్నతములు తెలియుటలేదు.

బోయీలు పల్లకిని కదలించినారు. ప్రయాణము జరుగుచున్నది. రహూగణుడు పల్లకిలో కూర్చుని యున్నాడు. ప్రయాణము సుఖవంతముగ లేదు. పల్లకి బాగా కదలి పోతున్నది. కుదుపు చున్నది. పల్లకి పైభాగము ఒకొక్కసారి రాజు మస్తకమును బలంగా తగులుచున్నది. కారణము రాజుకు తెలియుటలేదు.

భరతుడు పల్లకిని మోయుచున్నాడు. దారిలో ప్రాణిహింస జరుగునేమోయని భయపడుచు తన దృష్టిని నాలుగు మూరలకు మించి పోనివ్వకుండెను. దారిలో చీమలు మొదలైన కీటకములు కనిపించినచో వాటిపై కాలుపడకుండా దుముకు చుండెను. దాని వలన పల్లకీ కదలిపోగా, రాజు కలత చెందుచుండెను.

**హే వోఢారః సాధ్వతి క్రమత కిమితి విషమ ముహ్యతే యానమితి**

"ఓరీ! ఏమిటి విషమంగా పల్లకిని మోయుచున్నారు. జాగ్రత్త వహింపుడు" అనెను.

రాజుగారి దండన రూప వాక్కులు వాహకులలో భయమును కల్పించెను. "ప్రభూ! మేము మా కార్యమునందు అప్రమత్తులుగనే యున్నాము. పల్లకిని చక్కగనే మోయు చున్నాము. కానీ ఈ నూతన వాహకుడు సరిగ మోయుటలేదు. ఇతడు విచిత్రమైన వ్యక్తి వలె గన్పట్టుచున్నాడు. ఇతడు ఎందులకో ఒకొక్కసారి ఆగిపోవును. ఇంకొక్కసారి దుముకును. మరొకసారి పైకెగురును. ఇతని వింత ప్రవర్తన వలన ప్రయాణము విషమంగా మారుతున్నది" అని బోయీలనిరి.

రహూగణుడు పరమ ధార్మికుడు. అయినను ఆ సమయమున పరిస్థితుల ప్రభావముచే క్రుద్ధుడయ్యెను. రాజు భరతుని జూచి పలికెను.

రాజు భరతుని పరిహసించుచు, "సోదరా! పాపము! చాలా కష్టపడితివి. చాలా దూరమునుండి నీవు ఒక్కడివే పల్లకిని మోయుచున్నావు. అయ్యో! బడలిక కలుగలేదు గదా! నీ శరీరము దృఢముగలేదు. అవయవము లన్నియు బలహీనముగ యున్నవి" అని దృఢకాయుడైన భరతుని అవహేళన చేసెను.

భరతుడు మౌనముగ పల్లకిని మోయుచుండెను. తరువాత మరల పల్లకి అటు నిటు కదలెను. రహూగణుడు తీవ్రక్రోధావిష్టు డయ్యెను. "ఓరీ! దౌర్భాగ్యుడా! ఏమి నీ పొగరు? నీవు మరణించి యుంటివా? నేను ప్రభువును. నామాటను తిరస్కరించి వర్తించు చున్నావు. క్షణంలో నిన్ను యమునివలె దండించగలను. జాగ్రత్త" యనెను.

భరతుడు రహూగణునకు సమాధాన మిచ్చెను. రహూగణుని పుణ్యము భరతుడు పలుకునట్లు చేసినది. పుణ్యహీనులు గురుబోధను గ్రహింపలేరు. జీవులు పుణ్యముచే గురు వచనములను గ్రహింపగలుగుదురు. పాపాత్ములు గురుబోధను గ్రహింపలేరు.

భరతుడు చెప్పుచున్నాడు: "రాజా! నేను దృఢకాయుడను గానట్లు నీవు పలికితివి. అది సత్యము. స్థూలముగా యుండుట, కృశించి యుండుట దేహము యొక్క ధర్మము. నేను దేహమును గాను కనుక మీరు వచించినది సత్యమేయగును.

"నీవు జీవించి కూడా మరణించిన వాడవే యని పలికితిరి. అది కూడా వాస్తవమే. నీవు ఏ దేహమును జూచి నేనని భావించి పలుకుచుంటివో ఆ దేహము జీవించియున్నను మరణించినదియే. ఈ ప్రపంచములో ప్రతి వస్తువు కనిపించి కనుమరు గయ్యేదియే. ఈ జగత్తు తెలియుచున్నను లేనిదియే.

"ప్రభూ! ఇక నీవు పలికిన మూడవ విషయము. నేను ప్రభువును యని పలికితివి. అదియును సత్యమే. నీవు పాంచభౌతికమైన శరీరము గావు. ఇంద్రియములు గావు. మనస్సు గావు. బుద్ధివి గావు. వీటన్నిటికి సాక్షిమాత్రుడవు. చైతన్య రూపుడవైన ఆత్మవు గలివి. ప్రభువువు. సాక్షివి. సర్వగతుడవు.

"రాజా! నీవు పలికిన చివరి విషయము పరిశీలించ దగినదియే. నీవు నన్ను దండింతునని పలుకుట కూడా సమంజసమే. నీవు దేహము యని భావించుట వలన నేను గూడ దేహమే యని భ్రమించి దండింప దలచితివి. రాజా! అసత్య కలాపాలకు వగచ నవసరములేదు. స్వప్నగత విషయాలు జాగ్రదవస్థలో నిరుపయోగములే గదా!" యనెను.



రహూగణ చక్రవర్తికి కనువిప్పు కలిగెను. వెంటనే పల్లకీ దిగెను. తనను మోయు చున్నది పరమహంస యని గ్రహించెను. భరతుని పాదములపై బడెను. ముకుళితహస్తుడై భరతుని ప్రార్థించెను.

"మహాత్మా! నీవెవరు? యజ్ఞోపవీతమును ధరించి యుంటివి. బ్రాహ్మణుడవా! లేక అవధూతవా! తమరు ఎవరి శిష్యులు? ఇలా ఎందులకు సంచరించు చున్నారు? నన్ను ఉద్ధరించుటకు వచ్చితివా! భగవాన్! నేను ఏ మహాత్ముని దర్శనార్థము వెళ్ళుచుంటినో అట్టి కపిలుడు నీవుగాదు కదా!

"దివ్యాత్మా! నేను ఇంద్రుని వజ్రాయుధమును గాంచి భయపడను. త్రిపురారి శూలమును గాంచి భీతిచెందను. అగ్ని, సూర్య, వాయు కుబేరాదులు నాలో భీతిని కల్పించలేరు. తండ్రీ! బ్రహ్మజ్ఞానులైన మహాత్ములను జూచి భీతి చెందుదును. వారికి చేయు అపరాధమును గాంచి తల్లడిల్లెదను. నా తప్పిదమును క్షమింపుము. నీవు పరబ్రహ్మ రూపుడవు. నన్ను కడతేర్చి గాపాడుము" యని ముకుళితహస్తుడై ప్రార్థించెను.

సీ॥ ధరణీసురులలోన దలప నెవ్వడవు నీ వవధూతవేషి వై యవనియందు
నేమిటికై చరియింపంగ వచ్చి తి చట నొక్కడవు నొంటి సనుట నేడు
నను గృతార్థుని జేయ ననుకూలు డగుచున్న యట్టి యా కపిలమహామునీంద్రు
డవా? నీమహత్త్వంబు దవిలి విచారింప నెఱుగక చేసితి, గరుణ జూడు

తే॥ తప్పు సైరింపు, నే యమదండమునకు హరుని శూలంబునకును వజ్రాయుధమున
కనలచంద్రార్కధనద శస్త్రాస్త్రములకు వెఱవ, విప్రునికే మది వెఱచినట్లు.

"పరీక్షిన్మహారాజా! సింధుదేశాధిపతియగు రహూగణునిలో శ్రద్ధ ఉత్పన్నమగుట వేళ అతడు తత్త్వజ్ఞానము నొందుటకు అధికారి యయ్యెను" యని శుకబ్రహ్మ ఈ సందర్భమున ఆసక్తికర విషయమును తెలిపెను.

రహూగణ చక్రవర్తి ప్రథమంగా నిందించినపుడు భరతుడేమియును పలుకకుండెను. రాజు దేహముతో భాసించు చున్నందున అతనితో తాను భాషింప నవసరము లేదని భరతుడు భావించెను.

రెండవసారి దండించినపుడు భరతుడు రహూగణునికి సత్సంగ భాగ్యమును కల్పించ నెంచెను. తాను ఎవరిని మోయుచున్నాడో అట్టివాని మానసిక భారమును గూడ మోయవలెనని సంకల్పించెను. రహూగణుని పుణ్యమును భరతుడు దివ్యదృష్టితో గాంచెను. కపిలుని వద్ద జ్ఞానార్జనకు వెళ్ళుచున్న ఈ రహూగణుని తత్త్వజ్ఞాన సముపార్జనమునకు అధికారిని జేయవలెనని సంకల్పించెను. సత్సంగ మహిమను లోకానికి తెలియ జెప్ప నెంచెను. అహంకారమును వెంటబెట్టుకొని గురువును సమీపించువారు జ్ఞానమును పొందలేరు. నమ్రత గలవారే నిరంజన స్వరూపమును బొందగలరు. రహూగణుని లోని అజ్ఞానమును తొలగించి కపిలు నాశ్రయించుటకు అతనిని అధికారిని చేసెను. భరతునితో

కొన్ని నిముషములు సత్సంగము చేయుటవలన రహూగణునికి సాధన చతుష్టయ సంపద ప్రాప్తించెను.

## అద్వైత బోధామృతము

మానావమానముల యందు సమానముగా యున్న భరతుని గాంచి అతడు పరమ హంస యనియు, బ్రహ్మనిష్ఠుడనియు రహూగణుడు భావించెను. తన తప్పిదమును క్షమింపుమని కోరెను. రహూగణుడు పుణ్యాత్ముడు. ధర్మాత్ముడు. తత్త్వజిజ్ఞాస గలవాడు. సత్సంగ ప్రభావము నెరిగినవాడు. రహూగణు డాలోచించెను. మహాత్ముల సహచర్య భాగ్యము ఆశించినప్పుడు లభించదు. లభించినపుడే అవకాశమును వినియోగించుకొని లబ్ధి పొందవలెనని నిర్ణయించుకొని భరతుని కొన్ని ప్రశ్నల నడిగెను.

"మహాత్మా! నీ దివ్యవచనములు నిగూఢ తత్త్వపూర్ణములు. అందులో ప్రచ్ఛన్నమై యున్న జ్ఞానమును నేను గ్రహింపలేక పోతిని. జ్ఞాన సమన్వయమును పొందలేక యుంటిని. సామాన్య మానవులమైన మేము మీలాంటి మహాత్ముల అసమాన బోధను గ్రహింపలేము. దయచేసి నా సందేహములను నివృత్తిచేయుము" యని పలికి తన సంశయములను వెల్లడించెను.

"మహాత్మా! స్థూల సూక్ష్మము లనెడి ఔపాధిక ధర్మములు నాకు లేవు యని మీరు చెప్పినారు. కానీ దానిని నేను గ్రహింపలేకున్నాను. ఉపాధిధర్మము మిథ్యయని నే నంగీకరింప లేకున్నాను. శరీరము ఆత్మతో సంబంధమును కలిగియున్నదని నేను భావించుచున్నాను. దేహము ఇంద్రియములతో సంబంధమును కలిగియున్నది. ఇంద్రియ ములు మనస్సుతో సంబంధమును కలిగియున్నవి. మనస్సు బుద్ధితో సంబంధమును కలిగియున్నది. బుద్ధి ఆత్మతో ముడిపడి యున్నది. ఇలా దర్శించినచో దేహాత్మల ధర్మములు విడదీయరానివి. క్షీరపూర్ణమైన మృత్తికాఘటమును అగ్నిపై నుంచగనే పాలు తప్తమగుచున్నవి గదా? బయటవేడికి బియ్యం ఉడికి అన్నమగుచున్నది గదా? ఇదంతయూ ఉపాధియుక్తమే గదా?" యని ప్రశ్నించెను.

భరతుడు చెప్పుచున్నాడు: "బియ్యము అగ్ని తాపమునకు అన్నమగుచున్నది. మరి బియ్యమునకు బదులుగా ఱాయిని వేసినచో అది కరుగునా?" యని ప్రశ్నించుచూ తత్త్వజ్ఞానమును భరతుడు అమోఘముగా ప్రవచించెను.

"ఆత్మనిర్వికారి. సాక్షి స్వరూపము. ఆత్మ అసంగమైనందున దానికి ఉపాధులతో సంబంధము లేదు. ఔపాధిక ధర్మములు మనోజనితములు. మనోవికారములు. మనస్సు చేయు మాయా జాలమున చిక్కి తాను దేహమని మనుజుడు భ్రమించుచున్నాడు.

"స్వప్నమున అనేక విషయములు గోచరించును. సుఖదుఃఖములు తెలియును. అవి యన్నియు సత్యములు గావని మనకు తెలుసు. ఈ సత్యము ఎప్పుడు తెలిసినది? మేల్కొనిన పిదపే తెలిసినది. ఎవరయితే ఇంద్రియ సంగత్వము నుండి విడివడి యున్నారో



వారే నిజముగ మేల్కొని యుండువారు. అట్టివారికే ఈ ప్రపంచము మిథ్యయని తెలియును.

"ఈ ప్రపంచమునకు మనస్సు కన్నను వేరుగా అస్తిత్వము లేదు. మనస్సు ఏ విధముగా యున్నచో ప్రపంచము ఆ విధముగ తెలియును. జగత్తులో గోచరించు వికారములు వాస్తవానికి మానసిక వికారములే. పాప పుణ్యము లనెడి వాసనలతో నిండిన మనస్సు కామక్రోధాది వికారములచే విచలితమై గుణయుక్తమై చరించుచుండును. ఆ మనస్సే జీవుని సంసారమును తయారు చేయుచున్నది. మోహవలయంలో పడదోయు చున్నది. దుర్భర ఫలములను పంచిపెట్టు చున్నది.

**చిత్తం కారణ మర్థానాం తస్మిన్సతి జగత్త్రయమ్**
**తస్మిన్ క్షీణే జగ త్క్షీణం తచ్చికిత్స్యం ప్రయత్నతః**

"సమస్త విషయములకు మనస్సే కారణమగుచున్నది. మనస్సొక్కటి యున్నచో ముల్లోకము లుండును. మనస్సు క్షీణించిన జగత్తు క్షీణించును. కనుక మనస్సునకు చికిత్స చేయించుటకు ప్రయత్నింపవలెను" యని మహోపనిషత్తు ప్రవచించినది.

"భోగముల యందు ఆసక్తిగల మనస్సు బంధమును కలిగించుచున్నది. దీనిని బట్టి ఆలోచించినచో ఏ మనస్సునకు భోగేచ్ఛ యుండదో అట్టి మనస్సు ముక్తికి కారణ మగునని తెలియును.

"జీవుడు స్వభావతః నిస్సంగుడు, నిర్గుణుడు. ఈ సత్యము అవగతము గానంత వరకు జీవుడు మనస్సుతో తాదాత్మ్యం చెంది సంసార వలయమున పరిభ్రమించు చుండును. మనస్సే మనిషికి శత్రువు. దానిని ఉపేక్షించినచో దాని బలము పెరుగును. మేఘము సూర్యుని నిరోధించినట్లు జీవప్రకాశమును మనస్సు నివారించును. హరిగురు చరణోపాసన యనెడి శస్త్రమును చేబూని మనస్సును ఖండింపవలె" నని జడభరతుడు రహూగణునకు చెప్పెను.

రహూగణుడు భరతునికి నమస్కరించెను. "దేహాభిమాన మనెడి సర్పము నా వివేకమును కాటు వేసినది. అమృత తుల్యమైన మీ మాటలు నన్ను పునర్జీవితుని గావించినవి. మహాత్మా! అమృతమయమగు ఈ ఆత్మ విద్యను అజ్ఞానినైన నా కొఱకు సులభతరము చేయుడు" యని ప్రార్థించెను. భరతుడు మఱల బోధించుట కుపక్రమించెను.

"రాజా! పాంచభౌతికమగు శరీరములే ఈ ప్రపంచమున తెలియుచున్నవి. రూపము లన్నియు మృత్తికా నిర్మితములే. పల్లకిని మోయు బోయీల దేహముల యందు మట్టియే యున్నది. వారు మోయు పల్లకి గూడ మట్టియే. ఆ పల్లకియందు ఆసీనమైయున్న సింధు దేశాధిపతి దేహము గూడా మట్టియే. ఆ మట్టి దేహమే తానని గట్టిగ నమ్మియున్న రాజు దేహాభిమానమనెడి రోగముచే బాధపడుచున్నాడు. ఇది యంతయు మిథ్యయే. మాయాకార్యమే" యనెను.

జగత్తు, ఉపాధులు సమస్తము మాయే యైనచో ఇక సత్యమెయ్యది? యనెడి శంక ఉదయించును. దానికి సమాధానము చెప్పుచున్నారు.

**జ్ఞానం విశుద్ధం పరమార్థమేక మనన్తరం త్వ బహిర్బ్రహ్మ సత్యమ్**
**ప్రత్య క్ప్రశాన్తం భగవచ్ఛబ్ద సంజ్ఞం యద్వాసుదేవం కవయో వదన్తి ॥**

"సత్యమైనది జ్ఞాన మొక్కటియే. అది నిర్మలమైనది. అతీతమైనది. సర్వగతమైనది. సర్వుల యందు భాసించుచున్నది. ఈ అద్వైతజ్ఞానము యొక్క సంపూర్ణరూపమే వాసుదేవుడు."

ఈ విధమైన అనిర్వచనీయ అద్వయజ్ఞానము సత్సంగము ద్వారానే లభ్యమగునని భరతుడు చెప్పుచున్నాడు. భాగవతోత్తముల పాదరజోభిషేకము లేనిదే తత్త్వజ్ఞానము అలవడదు యని చెప్పుచున్నాడు.

భాగవతుల సహచర్యము విషయ వార్తాప్రసంగము నంత మొందించును. లౌకిక వ్యవహారములను దూరము చేయును. భగవద్గుణాను కీర్తనము అవ్యాప్తమగును. పరమాత్మయందు నిర్మలమైన భక్తి కలుగును.

మహాత్ముల కడ శ్రవణము చేయనివానికి భక్తి కుదరదు. జ్ఞానులైన వారందరు గతంలో శ్రవణము ద్వారానే జ్ఞానము నార్జించిరి. ఋషులు కూడ వేదములను ప్రథమంగా ఆలకించిరి. అందుచేతనే అవి శ్రుతులని పిలువబడినవి.

శ్రవణము సంశయములను నివారించును. ఆత్మానాత్మ వివేకజ్ఞానము నందించును. మనస్సునకు స్ఫూర్తి నిచ్చును. బుద్ధికి దృఢత్వమును కల్పించును. శ్రవణము వలన భక్తి జ్ఞాన, వైరాగ్యము లేర్పడును. కామ క్రోధములు నిర్వీర్యమగును. భూతదయ కలుగును. వశ్చాత్తాపాది సుగుణములు యేర్పడును. హృదయము నిర్మలమగును.

అజ్ఞానాంధకారము నదృశ్యమొనర్చి జ్ఞానజ్యోతిని వెలిగించునది సత్పురుష సాంగత్యమే గనుక ప్రతి ఒక్కరు సత్సంగమును పొందియుండవలెను. సత్సంగము వాసుదేవుని యందు శుద్ధమగు ప్రేమను కల్పించును యని భరతుడు చెప్పెను.

**సీ॥ ధరలోన బ్రహ్మంబు దపమున దానంబు లను గృహధర్మంబులను జలాగ్ని**
**సోమసూర్యులచేత శ్రుతులచే నైనను పరమభాగవతుల పాదసేవ**
**బొందిన మాడ్కిని బొందంగ రాదని పలుకుదు రార్యులు బరమమునులు**
**ఘనతపోబాహ్యసౌఖ్యములకు విముఖులు నయపుణ్యులు హరిగుణానువాద**
**తే॥ మోదితాత్ములు నగు బుధపాదసేవ ననుదినంబును జేసిన నంతమీద**
**మోక్షమార్గంబునకును బద్మాక్షునందు బట్టువడియుండు నెప్పుడు బరగ బుద్ధి.**

"రహూగణ మహారాజా! పూర్వము నేను భరతుడను పేరుతో రాజునై యుంటిని. దృశ్య శ్రవణాదుల యందు మనస్సును లగ్నమొనర్చిన కారణముచే మృగమునై జన్మించితిని. చిరకాల సాధనలు ఈ దోష వర్తనము వలన మృగజన్మను ప్రసాదించినవి.

"రాజా! భగవత్కృప అపూర్వమైనది. అమోఘమైనది. మృగ దేహమును ధరించినను పరమాత్మ కృపచేత నా పూర్వస్మృతి మృతి చెందలేదు. అందుచేత జనసంగమునన నాకు



భీతి గలిగెను. ఏకాకిగ, ప్రచ్ఛన్నముగ యుండి నా మనస్సును భగవచ్చరణముల యందు లగ్న మొనర్చితిని. రాజా! నీకు ఒక్క సత్యమును చెప్పెదను. దీనిని ప్రగాఢముగ విశ్వసింపుము.

**శ్లో॥ తస్మాన్నరోఽసఙ్గ సుసఙ్గ జాత జ్ఞానాసి నైహైవ వివృక్ణ మోహః**
**హరిం తదీహా కథన శ్రుతాభ్యాం లబ్ద స్మృతి ర్యాత్యతిపార మధ్వనః**

"రాజా! భాగవతోత్తముల సాంగత్యము వలన ఉదయించిన జ్ఞానమనెడి ఖడ్గముచే ఈ జన్మము నందే హరికథా శ్రవణ కీర్తనాదుల నాచరించి, సంసార మనెడి సాగరమును దాటి ఆవలి తీరమును చేరి తరించుము." అని భరతుడు పలికెను.

## సంసారారణ్యము

ఆత్మ తత్త్వమును వివరించిన పిదప సంసారారణ్యమును గురించి భరతుడు వివరించు చున్నాడు. ఈ సంసారారణ్యమును దాటినవారే శాంతి ధామమును చేరుదురు. మార్గము తెలియని వాడు గమ్యమును చేరలేడు. మార్గము తెలియుటయే గాదు. మార్గముయొక్క తీరుతెన్నులు గూడ తెలియవలసి యుండును. ఇది భయంకరమైన అరణ్యము. భవారణ్యము.

సంసారమార్గము దుస్తరమైనది. సుఖాన్వేషులైన మనుజులు నలువైపుల చరించుచు, దారి తెలియక పరిభ్రమించుచు చివరికి సంసారారణ్యములో ప్రవేశింతురు. కానీ సుఖశాంతులను బొందలేరు.

సంసారారణ్యములో ఆరుగురు చోరులుందురు. వారే మనస్సుతో గూడిన పంచ జ్ఞానేంద్రియములు. సుఖము నార్జింపవలెనని వ్యాపారివలె చరించు వాని బుద్ధి యనెడి సారధి మైమరచి దారి దప్పి యుండుటను గాంచి ఈ ఆరుగురు చోరులు ఆ వణిజుని జ్ఞాన ధనమును హరింతురు.

అరణ్యములో తోడేళ్ళు మేకను హరించునట్లు సంసారారణ్యమున భార్యాపుత్రాదులు మనుజుని చిత్తమున ప్రవేశించి ఛిద్రము చేయుదురు.

**సీ॥ ధరణీశ! మాయచేతను దాటగారాని పదమున బుట్టంగ బడ్డజీవు**
**డెలమిమై గుణకర్మముల జేయుచును లాభ మాశించి తిరుగు బేహారిమాడ్కి**
**ఫలమపేక్షించుచు బాయక జీవుండు సంసారగహనసంచారి యగుచు**
**ననవరతము నుండు నా మహావనమందు గామలోభాదితస్కరులు గూడి**
**తే॥ ధరణి విజితేంద్రియుడుగాని నరుని బట్టి ధర్మ మనియెడి యా మహాధనమువెల్ల**
**నరసి గొనిపోవుచుండుదు రనుదినంబు గాన సంసారమందు నాకాంక్షవలదు.**

ఈ సంసారమనెడి వనమున అసంఖ్యాకమైన తీగలతో, తృణములతో నిండియున్న కూపమున్నది. అదియే గృహము. పైకి అందముగనే గోచరించును. నిరపాయముగనే కనిపించును. కాలుపెట్టగనే దిగబడిపోవును. కనుక భవారణ్యమున ఒంటరిగ పోరాదు. గతంలో ఆ దారిన వెళ్ళిన వారిని అనుసరించాలి. ఆ మార్గము వైకుంఠుని వద్దకు గొని పోవును.

***హరివంఠీ ముని గేలే గేలే .................***
***నామూచేని పాఠెఁ జాతిల్ వైకుంఠె***

"మహర్షులందరు హరినామమనెడి బాటలో సాగిపోయినారు. నామస్మరణ విష్ణు నారాయణుని చేర్చును" యని సంత్ నామదేవ్ మహరాజ్ గానం చేశారు.

భవారణ్యమున నిద్రపోలేరు. విశ్రాంతి లభించదు. కామ్యకర్మము లనెడి దోమలు సదా కుట్టుచుండునని భరతుడు చెప్పుచున్నాడు. విరామ మెరుగక తపించు ఈ బాటసారికి అక్కడ గంధర్వ నగరము గోచరించును. గంధర్వ నగరము అసత్యమైనదియే. అయినను సత్యము వలె గన్పట్టును. అలాగే భవారణ్యమున దేహాదులనెడి అనిత్య విషయాలు నిత్యములై గన్పట్టును.

సంసారమనెడి అరణ్యమున మనుజుని భీతికి గురిచేయు కొటివి దయ్యమున్నది. అదియే సువర్ణము. కలియుగములో కలి సువర్ణము నందుండును. దయ్యమెలా భయ పెట్టునో బంగారు అలా భయపెట్టును. దానిని సంపాదించుటలో బాధ కలదు. నిలువ చేయుటలో బాధ కలదు. పోతుందని బాధ, పోయినను బాధే. ఈ స్వర్ణము సుఖము నందించునా?

***నిధి చాలా సుఖమో రాముని సన్నిధి సుఖమో నిజముగ బల్కు మనసా ॥***

యని త్యాగరాజస్వామి నిలదీసి మనస్సును ప్రశ్నించాడు.

ధనముపై ఆశను వీడనిచో జీవికి శాంతి లభించదు. ధనాన్ని ప్రేమించి వచ్చేవారిలో ఆత్మీయులెవరో తెలిసికొనుట బహుకష్టము. ధనము లేనినాడు దరిచేరువారే నిజమైన ఆత్మీయులు. ధనము శ్రేష్ఠత్వమునకు చిహ్నముగాదు. ధనము మోసగాండ్ర వద్దయుండును. చోరుల వద్దకూడా యుండును.

అరణ్యమున చరించువాడు వాయువుచే చెదరగొట్ట బడిన ధూళిచే నేత్రములు కలుషితము కాగా ఎలా దారిని గాంచలేక పరిభ్రమించు చుండునో అలాగే సంసారారణ్య మున కామ సుడిగాలిచే లేచిన రజోగుణమనెడి ధూళి నేత్రములను కప్పివేయగా మనుజుడు చూడవలసిన దానిని చూడడు. వినవలసిన దానిని వినడు.

ఈ భవారణ్యమున కర్ణకఠోరమైన భయంకర శబ్దములు వినిపించు చుండును. అవి. దుర్జను లనెడి గుడ్లగూబలు పలుకు కఠోర దుష్టవాక్కులు. ఎంత వినగూడదని ప్రయత్నించినను ఈ ఘోరమైన శబ్దాలు వినిపించుచునే యుండును. భగవానుడు పలికే తేటు మనిషి శాక్కనికి ప్రసాదించాడు. పలుకును అమృతమయం చేసుకోవాలి. అది భగవన్నామము నుచ్చరించుట వలననే లభిస్తుంది.



***నిత్య నామ ఘోష్ జయాచే మందిరీ***
***తేచి కాశీపురీ తీర్థ్ క్షేత్ర్ .............***
***హరినామామృత్ సేవీ సావకాశీ ...............***

"ఎవని గృహములో నిత్యము నామస్మరణము జరుగునో ఆ మందిరము కాశీ క్షేత్రముతో సమానము. అందుకని సావకాశముగా హరినామామృతమును పానము చేయుము" అని సంత్ ఏకనాథ్ మహారాజ్ తెలుపుతారు.

భవారణ్యమున సంచరించు మానవుడు ఆకలికి గురియగును. ఆకలి దీర్చుకొనుటకు అధర్మవృక్షము నాశ్రయించును. మానవుడు తన భుక్తి కొరకు అధర్మపరుల నాశ్రయించి, అట్టి పాప భోజనమును భుజించి మనస్సును పాడు చేసుకొనును.

ఒక్కొక్కసారి దాహముచే బాధపడుచు ఎండమావుల వెంట పరుగులిడును. తిరిగి తిరిగి అలసి పోవుటయే గాని దాహము తీరదు. సంసారబాధలు తీర్చుకొనుటకు లోభులనెడి ఎండమావుల నాశ్రయిస్తాడు. కానీ విఫలుడవుతాడు.

అరణ్యమున గజదొంగలు ధనమును హరింతురు. సంసారారణ్యమున బలవంతుడైన దొంగ సమస్తమును హరించును. అది గాంచి మనుజుడు దుఃఖితుడగును.

ఘోరమైన ఈ భవారణ్యమున గొప్ప గొప్ప పర్వతము లున్నవి. వాటిని అధిరోహించవలె నని ప్రయత్నించును. పాదరక్షలు లేని కారణాన కంటకములు గ్రుచ్చు కొనగ వ్యథ చెందును. సత్యమును దర్శింపవలెనని శాస్త్ర విషయములనెడి గిరులను ఎక్కుటకు ప్రయత్నించును. సహకరించువారు లేనందున సంశయము లనెడి కంటకముల వాతబడి దుఃఖించును.

ఈ విధముగా సంసారారణ్యమున పరిభ్రమించు వ్యక్తి నడచి నడచి అలసిపోయి నడువలేని స్థితిలో అతనిని కొండచిలువ కాటువేయును. సర్పదష్టుడై శవమువలె పడి పోవును. నిద్రయే కొండచిలువ. నిద్రించువాడు శవమువలె పడియుండును.

అరణ్య మధ్యమున తేనెపట్టులను గాంచి కొద్దిగ మధువును రుచి చూడవలెనని సమీపించును. అచ్చట తేనెటీగలచే కుట్టబడి దుఃఖము ననుభవించును. పరస్త్రీ లనెడి మధువును ఆశించి, ఆమె బంధుజన మనెడి తేనెటీగలచే బాధింపబడునని భావము.

"రహూగణ మహారాజా! నీవు కూడా ఈ భవారణ్యము నందే సంచరించు చున్నావు. దండించే కార్యమును విడనాడి ప్రేమించే బాటను ఎన్నుకో. విషయాసక్తిని వదలి నిర్విషయానంద సాగరములో ఓలలాడు. మాయాపాశమును ఛేదించి మాధవుని చేరి తరించు;" యని భరతుడు పలికెను.

జడభరతుని వాక్కుల నాలకించి పరవశుడైన రహూగణుడు "మహాత్మా! మహాత్ముల సాంగత్యము ఈ భూలోకముననే లభించును. కనుక ఈ మానవజన్మ పరమ ప్రశస్తమైనది. పవిత్రమైనది. సదా భగవంతుని స్మరించి తరించిన మీలాంటి మహాత్ముల చరణధూళి ఇక్కడే లభించగలదు. ఆ దివ్యమైన చరణ రజమును శిరమున ధరించిన

పాపి గూడ పవిత్రుడగును. బ్రహ్మాదులకు లభ్యముగాని శుద్ధభక్తిని బొందగలడు. మహాత్మా! నీ సాంగత్య భాగ్యము వలన నా కుతర్కమునకు కారణమగు అజ్ఞానము నశించినది. మహాత్మా! అజ్ఞానినై మిమ్ములను బాధించితిని. నన్ను క్షమింపుడు" అని రహూగణుడు భరతుని పాదములపై బడెను.

క॥ ధరణీసురవర! నీ శ్రీ చరణాంబుజయుగళరేణుసంస్పర్శము నా
దురితంబు లడచె నింతట హరిభక్తియు నంతకంత కధికం బయ్యెన్.

శుకబ్రహ్మ చెప్పుచున్నాడు: "పరీక్షిన్మహారాజా! భరతుని హృదయము నిస్తరంగ శాంతి సాగరము వలె నుండెను. రహూగణరాజు అవమాన పరచినను, స్తుతించినను ఆ రెండును అతని శాంతిని భగ్నము చేయలేక పోయినవి. రహూగణుడు పరమ భాగవతోత్తముడైన భరతుని వలన జ్ఞానమును బొంది దేహాత్మ భావమును త్యజించెను. రాజా! భగవత్పార్షదులైన భక్తుల చరణధూళి నాశ్రయించిన వారికే దేహాభిమానము తొలగును" అనెను.

ఈ సంసారారణ్యము యొక్క వివరణమును అందివ్వమని ప్రార్థించగా పదునాల్గవ అధ్యాయమున వివరించును. ఆ తరువాత భరతవంశ రాజులను గూర్చి తెలుపును. పోతనామాత్యుడు ఈ అధ్యాయము నుండి పంచమస్కంధము యొక్క ద్వితీయాశ్వాసము ప్రారంభమైనట్లు తెలుపుతాడు. ఇక్కడ నుండి తాత్త్వికవిషయములుగాని, కథలుగాని లేకుండా సామాన్యవిషయములు యున్నందున అలా భావించి యుండవచ్చును. ఈ కారణముగనే నేను గూడ పంచమ స్కంధమును ఇంతటితో సమాప్తి చేయుచున్నాను.

భరతవంశరాజుల చరిత్ర తరువాత భూగోళ వర్ణనము చేయబడినది. ఆ తరువాత గంగయొక్క స్తవము, మరియు సంకర్షణస్తవము చెప్పబడినవి. వివిధములైన వర్షములను వర్ణించుట, కిం పురుష భారత వర్షముల వర్ణనము, ఆఱు ద్వీపముల వర్ణనము, సూర్యుని రథ గమన వర్ణనము, గ్రహముల స్థితిగతుల వర్ణనము, శిశుమారచక్ర వర్ణనము, రాహువు మొదలగు గ్రహముల వర్ణనము, శ్రీసంకర్షణ స్తుతి, నరక వివరణము ఇత్యాది విషయములు చర్చింపబడినవి.

పంచమ స్కంధము సమాప్తము

........ ఓం .......

